ANN తెలుగు

Follow: @ANNTELUGU 30-09-2026

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 249 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## అనుమతులు ఇప్పించండి

**మహారాష్ట్రతో అంగీకారం కుదిరేలా చూడండి**

- 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వద్ద బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలి
- పాలమూరు–రంగారెడ్డి, డిండి, సీతారామసాగర్, గౌరెల్లికి పర్యావరణ అనుమతులు ఇవ్వండి.
- సమ్మక్కసాగర్‌కు పెండింగ్ అనుమతులు మంజూరు చేయండి
- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి.

03

టాప్ న్యూస్



### సిరిసిల్లలో కేటీఆర్‌కు సిన్మాచూపిస్తాం

- ప్రజల ముందే ఆయన భూభాగోతాలు బయటపెడతాం
- ఎంపీ చామల కిరణ్ హెచ్చరిక

03



### మేం ట్యాంపరింగ్ చేస్తే 400 సీట్లు వచ్చేవి

- 240 సీట్లతో ఎందుకు సరిపెట్టుకుంటాం
- కాంగ్రెస్‌పై ఈటల ఫైర్

02



### ఇక్కడున్నది మోదీ చంద్రబాబు పవన్ అని గుర్తుంచుకోవాలి

- సీఎం చంద్రబాబు
- మోదీ సహకారం, పవన్ హుషారుతో రాష్ట్ర అభివృద్ధి

02



## కేటీఆర్ ఇలాఖాలో సీఎం రేవంత్ టూర్

రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం

సిరిసిల్ల టౌన్ లో అంబేద్కర్ చౌరస్తా నుంచి గంటపాటు పాదయాత్ర

లక్షమందితో సిరిసిల్లలో సభ

**హైదరాబాద్, సిరిసిల్ల, మహా :** సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల పట్టణంలో బుధవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా దాదాపు రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. చేనేత కార్మికులు, మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఆ మేరకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సిరిసిల్ల రగుడు బైపాస్ సమీపంలో నిర్వహించే బహిరంగసభలో పాల్గొంటారు. చేనేత, పవర్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు నేతన్న బజార్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది. వేములవాడలో మహిళా పోలీస్ స్టేషన్, వేములవాడ, సిరిసిల్లలో రెండు ట్రాఫిక్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల పర్యటనకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం కరీంనగర్ నుంచి నేరుగా సిరిసిల్లలోని కళాశాల మైదానానికి చేరుకుంటారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల

మిగతా 2వ పేజీలో

## ఆయిల్‌పామ్ రైతులకు గుడ్‌న్యూస్

- ధరల స్థిరీకరణపై ప్రత్యేక కమిటీ.
- కేంద్ర వ్యవసాయ మంత్రి హామీ ఇచ్చారన్న తుమ్మల.



**ఢిల్లీ, మహా :** రాష్ట్రంలోని ఆయిల్‌పామ్ రైతులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుభవార్త చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన కేంద్ర ప్రభుత్వ రబీ అభియాన్ సదస్సుకు హాజరైన ఆయన తెలంగాణ వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ ధరల నియంత్రణ, ధరల స్థిరీకరణపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారని తుమ్మల తెలిపారు.

**ఆయిల్‌పామ్ ధరలపై కమిటీ**

ఆయిల్‌పామ్ రైతులు ఎదుర్కొంటున్న ధరల సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు

మిగతా 2వ పేజీలో




## అయ్యప్ప సొసైటీలో..

# ఆటవిక రాజ్యం...!

**మాధాపూర్ సర్కిల్‌లో అంతులేని అక్రమ నిర్మాణాలు...!**

**సెల్లార్, స్టిల్ట్‌తో పాటు 7 నుంచి 8 అంతస్తుల నిర్మాణాలు.!**

- మచ్చుకైనా కనిపించని సెట్‌బ్యాక్‌లు...!
- అగ్ని ప్రమాదాలు జరిగితే అంతే సంగతులేనా...!
- డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్‌కు కాసుల వర్షం కురిపిస్తున్న వైనం...!
- బ్రదర్స్‌కు ఇవ్వాలంటూ ప్రైవేట్ సైన్యంతో భారీగా వసూళ్లు...!
- ఒక్కో బిల్డర్ నుంచి ఒక్కో నిర్మాణానికి రూ. 25 నుంచి 30 లక్షల వరకు డిమాండ్...!
- గగ్గోలు పెడుతున్న బిల్డర్లు...!

02

హైదరాబాద్ మహానగరం నడిబొడ్డున గల అయ్యప్ప సొసైటీలో ఆటవిక రాజ్యం నడుస్తోంది.. మాధాపూర్ సర్కిల్50 పరిధిలో అంతులేని అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి.. సుమారు 40 మంది బిల్డర్లు బరితెగించి ప్రభుత్వ, ట్రస్ట్ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతూ అక్రమ దందాకు తెగబడుతున్నారు.. మచ్చుకైనా కనిపించని సెట్‌బ్యాక్‌లతో భవిష్యత్తులో అగ్ని ప్రమాదాలు జరిగితే అంతే సంగతులేనా అంటూ బహిరంగ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.. తిలా పాపం తలా పిడికెడు అన్న చందంగా డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రైవేట్ సైన్యాన్ని నియమించుకుని భారీ వసూళ్లకు పాల్పడుతున్నట్లు పేరు బయటకు చెప్పని బిల్డర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఒక్కో నిర్మాణానికి సంబంధిత బిల్డర్ల నుంచి రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఇవ్వాలంటూ హుకుం జారీ చేయడంతో వారు గగ్గోలు పెడుతున్నట్లు స్థానికంగా ఉన్న హోటల్ తాజా కిచెన్ లో చర్చ జోరుగా సాగుతోంది.






నాచారం బాబా నగర్ సంస్కృతి అపార్ట్మెంట్ ఎదురుగా జోరుగా సాగుతున్న అక్రమ నిర్మాణం

## అనుమతులు ఒకలా.. నిర్మాణం మరోలా..!

- అక్రమ నిర్మాణాలకు అధికారుల అండ..!
- మాస్టర్ ప్లాన్‌లోని 100 అడుగుల రోడ్డును ధిక్కరించి అనుమతులు జారీ..!
- అధికారుల పర్యవేక్షణ శూన్యం..!
- G+1 కి అనుమతి తీసుకుని.. కమర్షియల్ షట్టర్లతో G+2 నిర్మాణం..!
- నాచారం బాబానగర్‌లో.. సంస్కృతి అపార్ట్‌మెంట్ ఎదురుగా యథేచ్ఛగా సాగుతున్న వైనం..!
- 'కలర్స్ వేసుకోవాలంటూ' టౌన్ ప్లానింగ్ అధికారుల సూచనలు..!
- టౌన్ ప్లానింగ్ అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు..?
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు..!

02

**మహా, నాచారం (సిటీ బ్యూరో ):** నిబంధనలు బేఖాతర్.. అధికారుల పర్యవేక్షణ శూన్యం.. వెరసి అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాచారం సర్కిల్ బాబానగర్‌లో సంస్కృతి అపార్ట్మెంట్ ఎదురుగా నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఓ అక్రమ నిర్మాణం ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మాస్టర్ ప్లాన్‌ను తుంగలో తొక్కి, నిబంధనలను బూడిదలో పోసిన పన్నీరు చేస్తూ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**మాస్టర్ ప్లాన్‌కు తూట్లు..!***

బాబానగర్ సంస్కృతి అపార్ట్‌మెంట్ ఎదురుగా సాగుతున్న ఓ భవన నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం అక్కడ 100 ఫీట్ రోడ్డు నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు జారీ చేసినట్లు వారు

మిగతా 2వ పేజీలో



### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ

## అభ్యర్థులు ఖరారు

- నల్లగొండ-ఖమ్మంకు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి
- హైదరాబాద్ -రంగారెడ్డికి సామా రామ్మోహన్

**హైదరాబాద్, మహా :** కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారుచేసింది. నల్లగొండఖమ్మంవరంగల్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పేరును కాంగ్రెస్ హైకమాండ్ ఖరారుచేసింది. హైదారాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్ స్థానానికి సామా రామ్మోహన్ రెడ్డి పేరును ఫైనల్ చేసింది. ఈమేరకు పార్టీ జనరల్ సెక్రటరీ కేసీఆర్ వేణుగోపాల్ పేరుతో ప్రకటన విడుదలైంది.

# అయ్యప్ప సొసైటీలో ఆటవిక రాజ్యం...!



100 ఫీట్ రోడ్డు రెసోనెన్స్ కాలేజీ పక్కన



చందా నాయక్ నగర్ మహేంద్ర కార్ సర్వీస్ సెంటర్ ఎదురుగా

**హైదరాబాద్, మహా :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్ మహా నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతం, కీలకమైన ఐటీ కారిడార్‌కు కూతవేటు దూరంలో ఉన్న అయ్యప్ప సొసైటీలో ఆటవీకం రాజ్యమేలుతోంది. మాదాపూర్ సర్కిల్ 50 పరిధిలో నిర్మాణ నిబంధనలను తుంగలో తొక్కి అంతులేని అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సెల్లార్, స్టిల్ట్‌తో పాటు ఏడు నుంచి ఎనిమిది అంతస్తుల వరకు నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 200 గజాల నుంచి 1000 గజాల వరకు ఉన్న స్థలాల్లో అపార్ట్‌మెంట్లు, హాస్టళ్లు, వ్యాపార సముదాయాలు తదితర నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఎత్తైన బహుళ అంతస్థుల భవనాల మధ్య తగినంత సెట్ బ్యాక్‌లు లేకపోవడం వల్ల భవిష్యత్తులో అగ్ని ప్రమాధాలు జరిగితే అటు అధికారులు, ఇటు బిల్డర్లు బాధ్యత వహిస్తారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**అంజయ్యనగర్ దుర్ఘటనే దీనికి నిదర్శనం:**
నిర్మాణ నిబంధనలను విస్మరిస్తే ఎలాంటి పరిణామం ఎదుర్కోవాల్సి వస్తుందో అంజయ్యనగర్‌లో జరిగిన ఘటన మరోసారి గుర్తుచేసింది. ఇటీవల ఆగస్టు 22 న అంజయ్యనగర్‌లో డ్రైనేజీ నాలాను ఆనుకుని, కేవలం 50 చదరపు గజాల స్థలంలో నిర్మిస్తున్న ఏడు అంతస్తుల భవనం పేకమేడల్లా కుప్ప కూలిపోయి మధ్యప్రదేశ్‌కు చెందిన ఉమేష్ కర్రే (34), మోపత్ (42) అనే ఇద్దరు కార్మికులు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఈ ప్రమాదంలో పక్కనే ఉన్న వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్ కూడా తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటన అనంతరం హైడ్రా, మున్సిపల్ అధికారులు భవన యజమాని సయ్యద్ సాజిద్, కాంట్రాక్టర్ ఖాజా మొయినుద్దీన్‌లపై కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు.
అయితే ప్రమాదం జరిగిన తర్వాతే అధికారులు స్పందించాలా? ప్రమాదం జరగకముందే అక్రమ నిర్మాణాలను గుర్తించి ఎందుకు చర్యలు తీసుకోకూడదు? అన్న ప్రశ్నలు అయ్యప్ప సొసైటీ వాసుల నుంచి తలెత్తుతున్నాయి. అంజయ్యనగర్ ఘటనను కేవలం ఒక ప్రమాదంగా కాకుండా అధికారులకు ఓ హెచ్చరికగా పరిగణించాలని వారు కోరుతున్నారు.
అయ్యప్ప సొసైటీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీలు చేపట్టాలని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. మరో అంజయ్యనగర్ ఘటన పునరావృతం కాకముందే అక్రమ నిర్మాణాలను గుర్తించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ప్రాణనష్టం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే.. ముందస్తు పర్యవేక్షణతో ప్రమాదాలను నివారించడమే అధికారుల ప్రధాన బాధ్యతగా ఉండాలని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

**మచ్చుకైనా కనిపించని సెట్‌బ్యాక్‌లు..!**
అయ్యప్ప సొసైటీలోని చాలా నిర్మాణాల్లో కనీస సెట్ బ్యాక్‌లు కూడా పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవనాల మధ్య ఖాళీ ప్రదేశం తక్కువగా ఉండటంతో అత్యవసర సమయంలో అగ్నిమాపక వాహనాలు, ఇతర సహాయక వాహనాలు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదం జరిగిన తర్వాత కాకుండా ముందుగానే అధికారులు భవనాల వారీగా ఫైర్ సేఫ్టీని పరిశీలించి, నిబంధనలు పాటించని నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**అయ్యప్ప సొసైటీలో ఎక్కడ చూసినా అక్రమ కట్టడాలే:**
100 ఫీట్ రోడ్డు: అయ్యప్ప సొసైటీలోని 100 ఫీట్ ప్రధాన రహదారికి ఇరువైపులా 15 నుంచి 20 వరకు బహుళ అంతస్తుల భవనాలు, భారీ షెడ్లు వెలిశాయి.

**చందానాయక్ నగర్:**
చందానాయక్ నగర్‌లో ఏకంగా 20 నుంచి 30 వరకు అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు మహా డైలీ స్టేట్ బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. అక్కడ జరిగిన సంఘటనలను పూర్తిగా విశ్లేశించడం జరిగింది.

**ఇతర ప్రాంతాలు:**
చందా నాయక్ నగర్ వెంకటేశ్వరస్వామి ఆలయం పరిసరాల్లో 10 నుంచి 15 వరకు, బుట్టా కన్వెన్షన్ వెనుక 5 నుంచి 10 వరకు, శ్రీ చైతన్య ఐఐటీ అకాడమీ సమీపంలో 10 నుంచి 15 వరకు నిర్మాణాలు కొనసాగుతున్నాయని, ఇవి కేవలం మచ్చుకు మాత్రమేనని, అయ్యప్ప సొసైటీ పరిధిలో ఇంకా వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

**'సీఎం బ్రదర్స్' పేరుతో డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ, ఏసీపీ హబీబున్నీసా బారీగా వసూళ్లు!**
మాదాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హబీబున్నీసా అయ్యప్ప సొసైటీలో జరిగే ప్రతి నిర్మాణానికి ఒక 'రేటు కార్డు' ఫిక్స్ చేసినట్లు స్థానిక బిల్డర్లు ఆరోపిస్తున్నారు. ఒక్కో నిర్మాణానికి ఏకంగా రూ. 25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారంటూ సదరు బిల్డర్లు గగ్గోలు పెడుతున్నారు. 'సీఎం బ్రదర్స్‌కు ఇవ్వాలి..' అంటూ ప్రైవేట్ సైన్యాన్ని ఏర్పాటు చేసి బిల్డర్లపై ఒత్తిడి తెచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఈ
వసూళ్ల వ్యవహారం బయటకు రాకుండా ఉండేందుకు సదరు అధికారులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగకుండా ప్రైవేట్ వ్యక్తులను ఏజెంట్లుగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యక్తులే క్షేత్రస్థాయిలో తిరుగుతూ బిల్డర్లను సంప్రదించడం, నిర్మాణాల ఆధారంగా మొత్తాలు మాట్లాడటం, డబ్బులు వసూలు చేయడం వంటి వ్యవహారాలు నడిపిస్తున్నారని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.



వెంకటేశ్వర స్వామి సాక్షిగా జరుగుతున్న 5 నిర్మాణాలు



వెంకటేశ్వర స్వామి టెంపుల్ ఎదురుగా

అధికారుల పేర్లతో జరుగుతున్న ఈ వసూళ్ల వెనుక అసలు వ్యవహారం ఏమిటి? ప్రైవేట్ సైన్యానికి ఎవరి అండదండలు ఉన్నాయి? వసూలైన మొత్తాలు ఎవరికి చేరుతున్నాయి? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరిపితే అసలు వాస్తవాలు బట్టబయలు అయ్యే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**గురుకుల్ ట్రస్ట్, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు ..**
ఖానామెట్ ప్రాంతంలో గురుకుల్ ట్రస్ట్, ప్రభుత్వానికి చెందిన వందల ఎకరాల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. సామాజిక సేవా కార్యక్రమాలు, పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం దాత బన్సీలాల్ గురుకుల్ ట్రస్ట్ భూములను ట్రస్ట్‌కు విరాళంగా ఇచ్చినట్లు రెవెన్యూ రికార్డులను బట్టి స్పష్టమవుతోంది . అనంతరం ఈ భూములకు సంబంధించి అనేక వివాదాలు తలెత్తగా, కొంత భూమిని ప్రైవేట్ వ్యక్తులు దూరాక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

**రిజిస్ట్రేషన్లు.. విద్యుత్ కనెక్షన్లు ఎలా వచ్చాయి..?**
అనుమతులకు విరుద్ధంగా కొనసాగుతున్న నిర్మాణాలకు రిజిస్ట్రేషన్లు, విద్యుత్, నీటి కనెక్షన్లు ఎలా లభిస్తున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నోటరీ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలకు విద్యుత్, నీటి కనెక్షన్లతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు వంటి సౌకర్యాలు కల్పించకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ, భారీగా లంచాలు మెక్కి అడ్డదారిలో అనుమతులు, రాచ మర్యాదలు, సౌకర్యాలు కల్పిస్తున్నారంటూ స్థానికులు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత శాఖలు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు. అయ్యప్ప సొసైటీలో నోటరీ భూములకు వందల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు, వేల సంఖ్యలో విద్యుత్ మీటర్లు ఏ ప్రాతిపదికన మంజూరు చేశారు? వాటి కోసం సమర్పించిన పత్రాలు ఏమిటి? నిబంధనల ప్రకారం పరిశీలన ఎలా జరిగింది? అన్న వివరాలను విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యత ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.కేవలం విద్యుత్, నీటి కనెక్షన్ ఉండటం మాత్రమే భవన నిర్మాణం చట్టబద్ధమైనదని నిర్ధారించదని, నిర్మాణ అనుమతులు, భవన ప్లాన్, భూమి హక్కులు, నిర్మాణ వినియోగం తదితర అంశాలను సంబంధిత విభాగాలు సమగ్రంగా పరిశీలించాల్సి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**ప్రమాదం తర్వాత కాదు.. ముందే చర్యలు తీసుకోవాలి ..**

అంజయ్యనగర్ ఘటనలో ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో నిర్మాణ భద్రతపై అధికారులు మరింత అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని, ప్రమాదం జరిగిన తర్వాత కూల్చివేతలు, కేసులు నమోదు చేయడం కంటే ముందుగానే నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అయ్యప్ప సొసైటీలోని నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు అధికారులపై వస్తున్న వసూళ్ల ఆరోపణలపైనా విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



100 ఫీట్ రోడ్డు RENAO కేఫ్ పక్కన



100 ఫీట్ రోడ్డు ప్రధాన రహదారిలో



శ్రీ చైతన్య ఐ ఐ టి అకాడమీ పక్కన



శ్రీ చైతన్య ఐ ఐ టి అకాడమీ ఎదురుగా



## ఇక్కడున్నది మోదీచంద్రబాబు పవన్ అని గుర్తుంచుకోవాలి : సీఎం చంద్రబాబు

**మోదీ సహకారం, పవన్ హుషారుతో రాష్ట్ర అభివృద్ధి**

**ఉదయగిరి, మహా :** కూటమి ప్రభుత్వం పేదలకు పట్టాభిషేకం చేస్తుంటే, మరికొందరు విధ్వంసంతో రక్తాభిషేకం చేస్తామంటున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే సహించే ప్రసక్తి లేదని, ఇక్కడ ఉన్నది మోదీ, చంద్రబాబు, పవన్ అని గుర్తుంచుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రత్యర్థులను హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలోని విధ్వంసానికి, నేటి కూటమి ప్రభుత్వ వికాసానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ఉదయగిరి నియోజకవర్గంలో నిర్వహించిన 'పల్లె పండుగ 3.0' బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, తన అనుభవం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ హుషారుతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రక విజయాన్ని అందించారని, ప్రస్తుతం ఆ ప్రజాదరణ మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమిదే ఘనవిజయమని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పల్లెలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, కనీస సౌకర్యాల కల్పనకు కూడా నిధులు లేని దుస్థితి నెలకొందని విమర్శించారు. గత ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు మాత్రమే నిర్మిస్తే, తమ ప్రభుత్వం కేవలం రెండేళ్ల వ్యవధిలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లను నిర్మించిందని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం, ఖాళీ ఖజానా ఉన్నప్పటికీ, 'సూపర్ సిక్స్' వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు రెండో దశను పూర్తి చేసి ఉదయగిరి నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు.

# అనుమతులు ఒకలా.. నిర్మాణం మరోలా..!

( మొదటి పేజీ తరువాయి )

ఆరోపిస్తున్నారు. దీంతో భవిష్యత్తులో రహదారి విస్తరణకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
కేవలం జి+1 (గ్రౌండ్ ప్లస్ వన్) నివాస గృహానికి మాత్రమే అనుమతి తీసుకున్న సదరు మర్వాడి .. అందుకు భిన్నంగా కమర్షియల్ వినియోగానికి సంబంధించిన రెండు షట్టర్లతో కూడిన జి+2 (గ్రౌండ్ ప్లస్ టూ) నిర్మాణాన్ని కొనసాగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అనుమతుల్లో ఒక విధంగా చూపించి.. క్షేత్రస్థాయిలో మరో విధంగా నిర్మాణం చేపడుతున్నా సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అనుమతులు ఒకలా.. నిర్మాణం మరోలా..!**
నివాస నిర్మాణానికి అనుమతి తీసుకుని వాణిజ్య అవసరాలకు అనుగుణంగా షట్టర్లు ఏర్పాటు చేస్తూ అదనపు అంతస్తు నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణ స్థలంలో జరుగుతున్న పనులను పరిశీలించి, అనుమతులు, నిర్మాణ విస్తీర్ణం, అంతస్తుల సంఖ్య, భవన వినియోగం తదితర అంశాలను అధికారులు ధృవీకరించాల్సిన అవసరం ఉందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.
అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లయితే నిబంధనల ప్రకారం వెంటనే పనులను నిలిపివేసి, సంబంధిత యజమానిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే నిర్మాణ పనులు కొనసాగుతున్నా అధికారులు స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారుల అండదండలు.. ముడుపుల పర్వం?**
కళ్ళ ముందే ఇంత పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణం జరుగుతున్నా టౌన్ ప్లాన్ అధికారులు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద కథే నడుస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్ .. సదరు యజమానికి వత్తాసు పలుకుతూ, "త్వరగా కలర్స్




(రంగులు) వేసేసుకోండి.. ఎవరూ ఏమీ చేయలేరు" అంటూ అంతర్గతంగా సూచనలు చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు అందినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?**
నిర్మాణ అనుమతులు మంజూరు చేసిన తర్వాత క్షేత్ర స్థాయిలో నిర్మాణం అనుమతుల మేరకే జరుగుతుందా లేదా అన్నది పరిశీలించాల్సిన బాధ్యత సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులపై ఉంది. ముఖ్యంగా అనుమతుల్లో జి+1గా ఉండి.. క్షేత్రస్థాయిలో జి+2 నిర్మాణం, కమర్షియల్ షట్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లయితే అధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది. కానీ భారీ మొత్తం లో ముడుపులు ముట్టాయనే ఆరోపణలు వినిపిస్తుండగా, నిర్మాణ దశలోనే నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు.. నిర్మాణం పూర్తయ్యే వరకు వేచి చూస్తున్నారా అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి.

**చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్..**
అధికారుల అండతోనే ఇష్టారాజ్యంగా నిర్మిస్తున్న ఈ అక్రమ కట్టడంపై తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరపాలని, నిబంధనలు ఉల్లంఘించిన భవనాన్ని కూల్చివేసి, అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాబానగర్ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆయిల్‌పామ్ రైతులకు గుడ్‌న్యూస్

( మొదటి పేజీ తరువాయి )

తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ధరల నియంత్రణ, ధరల స్థిరీకరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కమిటీ దోహదపడుతుందని తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర, మార్కెట్ లో ధరల స్థిరత్వం వంటి అంశాలపై అధ్యయనం చేసి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను మరింత విస్తృతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయ సేవలు అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కేంద్రాన్ని కోరారు. వ్యవసాయ భూముల్లో భూసారాన్ని పరీక్షించేందుకు ఉపగ్రహ ఆధారిత సాంకేతికతను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని తుమ్మల కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. భూమి స్వభావం, భూసార పరిస్థితులను శాస్త్రీయంగా గుర్తించడం ద్వారా రైతులకు పంటల ఎంపిక, ఎరువుల వినియోగంలో మెరుగైన సూచనలు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

**కూరగాయల సాగు లక్ష్యం పెంచాలి**
రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగును మరింత ప్రోత్సహించేందుకు కూరగాయల సాగు లక్ష్యాన్ని లక్ష ఎకరాలకు పెంచాలని మంత్రి తుమ్మల కేంద్రాన్ని కోరారు. ఇందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని రైతులకు అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూరగాయల సాగును విస్తరించడం ద్వారా ఉద్యానవన రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందని తుమ్మల తెలిపారు. రైతులకు అవసరమైన సహాయం అందిస్తే కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు అవకాశం ఉంటుందని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు.

# కేటీఆర్ ఇలాఖాలో సీఎం రేవంత్ టూర్

( మొదటి పేజీ తరువాయి )

వేసి నివాళులర్పిస్తారు. తర్వాత కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో నేతన్నచౌక్, పాత బస్టాండ్, కొత్తచెరువు మీదుగా ర్యాలీగా రగుడు వద్ద బహిరంగసభ ప్రాంగణానికి చేరుకుంటారు. సీఎం స్వయంగా ర్యాలీలో ముందుండి నడవనున్నందున భారీగా పార్టీ శ్రేణులు, ప్రజలను సమీకరించేలా నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఇవీ అభివృద్ధి కార్యక్రమాలు**
సిరిసిల్ల, వేములవాడలలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.
పెద్దూరులో 18 ఎకరాల్లో ప్రతిపాదించిన ఈ కాంప్లెక్సులో 5 నుంచి 12వ తరగతి వరకు 2600 మంది విద్యార్థులు చదువుకునేలా 64 తరగతి గదులు, వసతి, డార్మెటరీలు, డైనింగ్ బ్లాక్, క్రీడామైదానాలు ఉంటాయి.
సిరిసిల్ల, కోనరావుపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రీప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు తరగతి గదులు, ల్యాబ్‌లు, డైనింగ్‌హాల్స్, క్రీడాసదుపాయాలు, ఐటీ మౌలిక వసతులు ఉంటాయి.
వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయాభివృద్ధిలో భాగంగా రూ.99.40 కోట్ల పనులకు శంకుస్థాపన చేస్తారు. మండపాలు, గోపురాలు, ప్రాకారాలు, నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, విద్యుత్తు పనులు, షాపింగ్ కాంప్లెక్సులు, ఉత్తరంవైపు సీసీరోడ్డు తదితర 26 పనులు ఉన్నాయి.
సిరిసిల్ల, వేములవాడ ఆర్టీవో కార్యాలయాలు, తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, రుద్రంగిలో నాలుగు తహసీల్దారు కార్యాలయాలు, వేములవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తారు.
వ్యవసాయ ఉత్పత్తుల నిల్వలకు ఉపయోగపడేలా రుద్రంగిలో 10,000 టన్నుల సామర్థ్యంతో గోదాములు, అనుబంధ యూనిట్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.
సిరిసిల్ల మున్సిపాలిటీ పెద్దూరులో నిర్మించిన ఇందిరా మహిళాశక్తి భవన్‌ను సీఎం ప్రారంభిస్తారు.



## మేం ట్యాంపరింగ్ చేస్తే 400 సీట్లు వచ్చేవి

**240 సీట్లతో ఎందుకు సరిపెట్టుకుంటాం**

**కాంగ్రెస్‌పై ఈటల ఫైర్**

**ఢిల్లీ, మహా :** ఓట్ల ట్యాంపరింగ్ విషయంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాము ఓట్లను ట్యాంపరింగ్ చేసి ఉంటే లోక్‌సభలో 400 సీట్లు గెలిచేవాళ్లమని, కేవలం 240 సీట్లతో ఎందుకు సరిపెట్టుకుంటామని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని చూసి ప్రజలు ఛీ కొడుతున్నారని, భారత ప్రజాస్వామ్యాన్ని ఆయన నవ్వులపాలు చేస్తున్నారని మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. ఈవీఎంలను రాజీవ్ గాంధీ హయాంలోనే ప్రవేశపెట్టారని, వీవీప్యాట్‌లను మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈటల గుర్తుచేశారు.

# ఏపీ విద్యా సంస్కరణలకు సింగపూర్ ప్రశంసలు

**లోకేశ్‌కు షణ్ముగం కితాబు**

తిరుమల, మహా : ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వినూత్న సంస్కరణలను సింగపూర్ ప్రభుత్వం ప్రశంసించింది. రాష్ట్ర విద్యావ్యవస్థ బలోపేతానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని సింగపూర్ హోం, న్యాయశాఖల మంత్రి కె. షణ్ముగం హామీ ఇచ్చారు. మంగళవారం తిరుమలలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఆయన భేటీ అయ్యారు. శ్రీవారి దర్శనం అనంతరం ఇరువురు నేతలు రాష్ట్ర అభివృద్ధి, విద్యా సంస్కరణలు, మాదకద్రవ్యాల నివారణ వంటి కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను, ముఖ్యంగా విద్యారంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులను మంత్రి లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పనితీరుతో పాటు విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను మంత్రి షణ్ముగం ఈ సందర్భంగా అభినందించారు. పాఠశాలల్లో డ్రాపౌట్ రేటును సున్నా శాతానికి తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి షణ్ముగం సూచించారు. బడి మానేసే పిల్లలే భవిష్యత్తులో మాదకద్రవ్యాల బారిన పడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సింగపూర్ తరహా కఠిన చట్టాలు అవసరమని అభిప్రాయపడుతూ, డ్రగ్స్ రహిత ఏపీ నిర్మాణానికి తమ సహకారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్న తీరును మంత్రి లోకేశ్ వివరించగా, ఏపీలోని ప్రభుత్వ పాఠశాలలను స్వయంగా సందర్శించేందుకు మంత్రి షణ్ముగం ఆసక్తి వ్యక్తం చేశారు. అలాగే, యువతకు



ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ అందించే లక్ష్యంతో ఏపీలోని ఐటీఐలను సింగపూర్‌కు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్' (ఐటీఈ)తో అనుసంధానించేందుకు పరస్పరం సహకరించుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM
జనరల్ వార్తలు | GENERAL NEWS
బుధవారం, హైదరాబాద్ | 30-09-2026
ANN తెలుగు

## సిరిసిల్లలో కేటీఆర్ కు సిన్మా చూపిస్తాం

**ప్రజల ముందే ఆయన భూభాగోతాలు బయటపెడతాం**
**ఎంపీ చామల కిరణ్ హెచ్చరిక**

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సిరిసిల్లలో కేటీఆర్‌కు అసలైన సినిమా చూపిస్తామని, ఆ రోజును ఆయన జీవితంలో మర్చిపోలేరని హెచ్చరించారు. గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు రాకముందే తనపై ఉన్న ఆరోపణలను బయటపెట్టాలని కేటీఆర్ సవాల్ చేయడంపై చామల తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రిని సవాల్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదని, ఆయన కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమేనని అన్నారు. సిరిసిల్ల ప్రజల ముందే కేటీఆర్ భూ బాగోతాలను రేవంత్ బయటపెడతారని, ఆయన అసలు స్వరూపం దేశమంతటికీ తెలుస్తుందని అన్నారు.



## సీఎం రాకకు సర్వం సిద్ధం

- భద్రత నుంచి ప్రోటోకాల్ వరకు సమగ్ర ఏర్పాట్లు
- అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు..
- కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ మహా** : ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రేపు కరీంనగర్‌లో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. నూతన సమీకృత కలెక్టరేట్ భవనం ప్రారంభోత్సవంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం పాల్గొననున్నందున భద్రత, ప్రోటోకాల్, ట్రాఫిక్, పార్కింగ్, ఇతర ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సీఎం భద్రతా అధికారులతో కలిసి నూతన కలెక్టరేట్ భవనంలోని ఏర్పాట్లను పరిశీలించారు. సమావేశ మందిరం, కలెక్టర్ ఛాంబర్, అదనపు కలెక్టర్ ఛాంబర్‌తో పాటు సీఎం పర్యటనలో వినియోగించే ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కడా చిన్నపాటి లోపానికి కూడా అవకాశం లేకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సీఎం పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, విద్యుత్, పరిశుభ్రత, ప్రోటోకాల్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలు సజావుగా జరిగేలా ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో స్వామి, వివిధ శాఖల అధికారులు, సీఎం భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.



## వెలుగుల జిలుగుల్లో.. కొత్త కలెక్టరేట్

- సీఎం రాకకు సర్వాంగ సుందరంగా ముస్తాబు..
- ప్రారంభోత్సవానికి సిద్ధమైన కరీంనగర్ నూతన పాలనా భవనం

**కరీంనగర్ మహా** : చీకట్లను చీల్చుకుంటూ విరజిమ్ముతున్న విద్యుత్ కాంతులు.. బంతిపూల వర్ణశోభతో మెరిసిపోతున్న ప్రాంగణం.. చూపుతిప్పుకోనివ్వని అలంకరణ.. ఇవన్నీ కలగలిసి కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవనాన్ని పండుగ వాతావరణంలోకి తీసుకొచ్చాయి. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభానికి మరికొద్ది గంటలే మిగిలి ఉండటంతో కలెక్టరేట్ భవనం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రాత్రివేళ వెలుగుల కాంతుల్లో కొత్త భవనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భవనం ముందు తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పూలదండలు, బంతిపూలతో భవనాన్ని అందంగా అలంకరించగా.. విద్యుత్ దీపాల వెలుగుల్లో కలెక్టరేట్ నూతన శోభను సంతరించుకుంది. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు రాత్రి వరకు ఏర్పాట్లలో నిమగ్నమై తుది పనులను పూర్తి చేశారు.

**అడుగడుగునా కలెక్టర్ పర్యవేక్షణ**

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రతి అంశాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. తరచూ అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ ఏర్పాట్లను పరిశీలించారు. వేదిక, ప్రాంగణం, అలంకరణ, భద్రత, పార్కింగ్, ప్రోటోకాల్ తదితర అంశాలపై అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. రాత్రి వరకు కొత్త కలెక్టరేట్ లో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు నూతన కలెక్టరేట్ భవనం ప్రారంభానికి సిద్ధం కావడంతో జిల్లా ప్రజల్లో ఉత్సాహం నెలకొంది. ఆధునిక వసతులతో అందుబాటులోకి రానున్న కొత్త కలెక్టరేట్ జిల్లా పరిపాలనకు కొత్త రూపాన్ని తీసుకురానుంది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ భవనం కరీంనగర్ జిల్లా పాలనా చరిత్రలో మరో ప్రత్యేక ఘట్టంగా నిలవనుంది.



## 24 గంటల్లో తాగునీటి సమస్య పరిష్కారం

**ఘట్కేసర్ సెప్టెంబర్ 29 మహా :** ఘట్కేసర్ మండలం పోచారం డివిజన్ పరిధిలోని చౌదరిగుడ గ్రామంలో సుమారు పది కాలనీలకు గత కొన్ని రోజులుగా తాగునీరు అందక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఘట్కేసర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కేశపాల వినోద్ కుమార్ వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించారు. పైప్‌లైన్‌లో జాయింట్ పాడై నీటి సరఫరా నిలిచిపోయిందని గుర్తించి, వెంటనే జలమండలి (హెచ్ఎండబ్ల్యూఎస్) అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులతో సమన్వయం చేసుకుని, స్వయంగా అక్కడే ఉండి పాడైన పైప్‌లైన్ జాయింట్ మరమ్మతు పనులు కేవలం 24 గంటల్లోనే పూర్తి చేయించారు. దీంతో నిలిచిపోయిన తాగునీటి సరఫరా తిరిగి ప్రారంభమై 10 కాలనీల ప్రజలకు ఉపశమనం లభించింది. “నిన్న సమస్యను తెలుసుకున్నాం.. నేడు పరిష్కారం చూపించాం” అనే విధంగా ప్రజా ప్రభుత్వం, ప్రజా పాలనలో ప్రజల మౌలిక అవసరాల విషయంలో ఎలాంటి ఆలస్యం లేకుండా స్పందిస్తామని, సమస్య పరిష్కారం అయ్యే వరకు అధికారులతో సమన్వయం చేసుకుంటామని వినోద్ తెలిపారు.

# మహారాష్ట్రతో అంగీకారం కుదిరేలా చూడండి

**ఢిల్లీ, మహా :** తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరగా అంగీకారం కుదిరేలా చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. మహారాష్ట్ర ప్రభుత్వం కోరిన సమాచారాన్ని ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం సమర్పించిందని తెలిపారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ +152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు రెండు రాష్ట్రాల మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన కృష్ణా, గోదావరి బేసిన్లలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయడంతో పాటు అంతర్రాష్ట్ర అంశాల పరిష్కారానికి కేంద్రం సహకరించాలని కోరారు.

**తుమ్మిడిహట్టి ఎత్తుపై విజ్ఞప్తి**

తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ +152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ మేరకు మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి అనుమతులు త్వరగా వచ్చేలా చూడాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం కోరిన సమాచారాన్ని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సమర్పించిందని ముఖ్యమంత్రి తెలిపారు. అవసరమైన సమాచారం అందించిన నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య అంగీకారం త్వరగా కుదిరేలా కేంద్రం చొరవ చూపాలని కోరారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని 152 మీటర్ల స్థాయిలో నిర్మిస్తే అక్కడి నుంచి ఎల్లంపల్లికి గురుత్వాకర్షణ ఆధారంగా నీటిని తరలించేందుకు అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి వివరించారు. ఈ విధానంతో నీటిని తరలించేందుకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, విద్యుత్ వ్యయం తగ్గుతుందని కేంద్ర మంత్రికి తెలిపారు.

**ముంపుపై సాంకేతిక అధ్యయనం**

తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎత్తుకు సంబంధించి ముంపు అంశాలపై సాంకేతిక అధ్యయనాలు జరిగినట్లు తెలంగాణ ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. 148 మీటర్ల నుంచి 152 మీటర్ల వరకు బ్యారేజీ ఎత్తును పరిగణనలోకి తీసుకుని అధ్యయనం చేసినట్లు తెలిపింది. ముంపు విస్తీర్ణంలో పెద్దగా తేడా ఉండదని రాష్ట్ర ప్రభుత్వం వివరించింది. తుమ్మిడిహట్టి అంశంలో కేంద్ర జలసంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర అధికారుల మధ్య చర్చలు జరగాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. రెండు రాష్ట్రాల మధ్య సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై చర్చలు జరిపి అంగీకారం కుదిరేలా కేంద్రం చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం, సీతారామసాగర్ బహుళార్థక ప్రాజెక్టు, గౌరవెల్లి రిజర్వాయర్‌కు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కేంద్ర జలశక్తి మంత్రిని కోరారు.

**సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో**

పర్యావరణ అనుమతులకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కేంద్రం మార్గదర్శకాలు జారీ చేయనున్న విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు చెందిన ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులను త్వరగా మంజూరు చేయాలని కోరారు. అనుమతుల జాప్యం కారణంగా ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి వివరించారు. ఇప్పటికే నిర్మాణ పనులు కొనసాగుతున్న ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు త్వరగా మంజూరు చేయడం ద్వారా పనులను వేగవంతం చేయాలని కోరారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జలసంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను కేంద్ర జలసంఘానికి సమర్పించినట్లు తెలిపారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులను త్వరగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు కేంద్ర జలసంఘం వేగంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ఛత్తీస్‌గఢ్‌తో చర్చలు**

సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్చలు జరుపుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ అంశంలోనూ అవసరమైన సహకారం అందించాలని కేంద్ర మంత్రిని కోరారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆధ్వర్యంలో చేపడుతున్న టెలీమెట్రీ పరికరాల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని సీఆర్ పాటిల్‌ను కోరారు. కృష్ణా నదీ జలాల వినియోగాన్ని పర్యవేక్షించేందుకు టెలీమెట్రీ పరికరాల ఏర్పాటు అవసరమని తెలిపారు. మొదటి దశ టెలీమెట్రీ పరికరాల ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిందని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. నిధులు సమకూర్చిన నేపథ్యంలో పరికరాల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని కోరారు. మొదటి దశ టెలీమెట్రీ పరికరాలను ఏర్పాటు చేయడంతో పాటు రెండో, మూడో దశలకు సంబంధించిన పరికరాలను కూడా త్వరగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కృష్ణా నదీ జలాల వినియోగాన్ని పర్యవేక్షించేందుకు అవసరమైన పరికరాల ఏర్పాటును వేగవంతం చేయాలని కోరారు. కేంద్ర జలశక్తి మంత్రితో జరిగిన సమావేశంలో తుమ్మిడిహట్టి, పాలమూరు-రంగారెడ్డి, డిండి, సీతారామసాగర్, గౌరవెల్లి, సమ్మక్కసాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. కృష్ణా, గోదావరి బేసిన్లకు సంబంధించిన ప్రాజెక్టుల పెండింగ్ అనుమతులు, అంతర్రాష్ట్ర అంశాలను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నీటిపారుదల శాఖ ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.





## నామినేటెడ్ రేసులో ఖలీద్ ?

- కార్పోరేషన్ పదవి దక్కే అవకాశం
- రాహుల్ పాదయాత్రలో నడిచిన నాయకుడు
- ఆదినుండి సీతక్క అనుచరుడిగా ప్రత్యేక గుర్తింపు

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మైనారిటీ నేత ఖలీద్‌కు కీలకమైన నామినేటెడ్ పదవి దక్కే అవకాశాలున్నాయి. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో సుదీర్ఘదూరం రాహుల్ వెంట నడిచిన ఖలీద్ ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గానికి చెందిన వాడైనా మంత్రి సీతక్కకు అనుచరుడిగా ఉన్నారు. సీతక్క సాయంతో మారుమూల ప్రాంతాల్లో అనేక డెవలప్ మెంట్ వర్క్స్ చేశాడు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నా ఎంతో అభిమానం. నేతలందరికీ తలలో నాలుకగా ఉండే ఖలీద్ పార్టీ ప్రయోజనాలే లక్ష్యంగా ఎపుడూ పనిచేస్తాడన్న పేరుంది. త్వరలో ఖలీద్ కీలకమైన నామినేటెడ్ పదవి దక్కే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది. చైర్మన్ లేదా రాష్ట్రస్థాయి కమిషన్లలో మెంబర్ గా ఖలీద్ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. తనను ఇష్టపడేవారు జాంటీగా పిలిచినా, ఆయన శక్తియుక్తులు, పనితీరు నేతలను ఎపుడూ ఆకట్టుకుంటుంది.



## వరంగల్ ట్రాఫిక్ పోలీస్ విభాగంలో ప్రకంపనలు

- ట్రాఫిక్ పోలీస్ అధికారి పై బదిలీ వేటు తప్పదా?
- అతి త్వరలో ట్రాఫిక్ కు రానున్న ఆ అధికారి ఎవరు?
- 15 నెలలకే మహిళా అధికారికి స్థానచలనం
- స్థాన చలనానికి అధికారి పై అవినీతి ఆరోపణలే కారణమా?

**వరంగల్, బ్యూరో మహా;** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ విభాగంలో ప్రస్తుతం అధికారి స్థాన చలనం పై తీవ్రమైన ఊహాగానాలు చెలరేగుతున్నాయి. అధికారిక వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారిన బదిలీల వ్యవహారం పై మహా తెలుగు దినపత్రిక పత్రికలో ఒక ప్రత్యేక కథనం. నగరంలో ట్రాఫిక్‌ను పరుగులు పెట్టించాల్సిన సదరు విభాగంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఒక మహిళా అధికారికి స్థానచలనం తప్పదనే వార్తలు పోలీస్ శాఖలో కలకలం రేపుతున్నాయి. కేవలం 15 నెలల స్వల్ప వ్యవధిలోనే ఆమెను లూప్ లైన్‌కు లేదా వేరే విభాగానికి బదిలీ చేసేందుకు తెరవెనుక పావులు కదులుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందుకోసం ఆ అధికారి సెలవులు తీసుకొని హైదరాబాద్ లోని డి జి ఆఫీస్ లో ఓ ఉన్నతాధికారి అండతో పైరవీలు మొదలుపెట్టినట్లు సమాచారం.

**స్థాన చలనానికి అవినీతి ఆరోపణలే కారణమా?**

పోలీస్ శాఖలో సాధారణంగా మూడేళ్ల కాలపరిమితి ముగిసిన తర్వాతే బదిలీలు జరుగుతుంటాయి. అయితే, ఈ మహిళా అధికారి బాధ్యతలు చేపట్టి కేవలం 15 నెలలే కావడం గమనార్హం. ఇంత తక్కువ కాలంలోనే ఆమెపై బదిలీ వేటు పడటానికి ఆమెపై వచ్చిన అవినీతి, వసూళ్ల ఆరోపణలే ప్రధాన కారణమనే వరంగల్ ట్రాఫిక్ సిబ్బంది మధ్య ప్రచారం జోరుగా సాగుతోంది. నగరంలోని కొన్ని కీలక వ్యాపార సంస్థలు, రవాణా రంగాల నుండి పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలగకుండా ఉండేందుకే ఈ ముందస్తు బదిలీ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

**ట్రాఫిక్‌కు రానున్న ఆ కొత్త అధికారి ఎవరు?**

ప్రస్తుత మహిళా అధికారి స్థానంలో వరంగల్ ట్రాఫిక్ విభాగాన్ని చక్కదిద్దేందుకు ఒక సమర్థుడైన, కఠినమైన అధికారిని నియమించేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించి మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న ఒక అధికారి పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను నియంత్రించడంతో పాటు, శాఖ పై పడిన అవినీతి మరకను తుడిచేయగల సత్తా ఉన్న వ్యక్తినే ఇక్కడికి పంపేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

**పోలీస్ వర్గాల్లో హాట్ టాపిక్**

ఈ ఆకస్మిక బదిలీ వ్యవహారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సదరు మహిళా అధికారి తన బదిలీని ఆపుకోవడానికి తీవ్రస్థాయిలో రాజకీయ ఒత్తిళ్లు తెస్తున్నప్పటికీ, ఉన్నతాధికారులు మాత్రం ఈసారి గట్టి నిర్ణయంతోనే ఉన్నట్లు సమాచారం. అతి త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. వరంగల్ ట్రాఫిక్ విభాగంలో రాబోయే మార్పులు, కొత్త అధికారి నియామకం పై మరిన్ని అప్‌డేట్స్ కోసం మరిన్ని వివరాలు మీ మహా తెలుగు దినపత్రికలో.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**ప్రమాద స్థలాలను పరిశీలించిన వరంగల్ సీపీ**

**వరంగల్, మహా;** వరంగల్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాలకు గల ప్రధాన కారణాలను గుర్తించి, భవిష్యత్తులో ప్రమాదాలను నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి వరంగల్‌ఖమ్మం జాతీయ రహదారిపై 14 ప్రాంతాలతో పాటు వరంగల్ కరీంనగర్ జాతీయ రహదారి పై 8 ప్రాంతాలను ప్రమాదాలు జరిగే ప్రాంతాలుగా గుర్తించి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆధికారిక లెక్కల ప్రకారం గడిచిన మూడు సంవత్సరాలలో వరంగల్ కమిషనరేట్ పరిదిలో వరంగల్‌ఖమ్మం జాతీయ రహదారి లో 108 రోడ్డు ప్రమాదాలు జరిగి, అందులో 80 మంది మరణించినట్లు, వరంగల్‌కరీంనగర్ జాతీయ రహదారిపై 79 రోడ్డు ప్రమాదాలు జరిగి, అందులో 37 మంది రణించినట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు అవసరమైన రోడ్డు భద్రతా చర్యలను తక్షణమే చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను సీపీ ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఎన్హెచ్ఎఐ, ఆర్ అండ్ బి మున్సిపల్, రవాణా, ఎక్సైజ్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీస్ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మరో బైపోల్ కు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమా?

**వరంగల్, బ్యూరో మహా;** రాష్ట్రంలో బై పోల్స్ ఎన్నికలతో రాజకీయం వేడెక్కుతోంది. ఖైరతాబాద్ తో పాటు మరో నియోజకవర్గానికి ఉపఎన్నిక రాబోతోందా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెస్తున్న వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారి తీస్తోంది. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఉపఎన్నిక జరిగే అవకాశం ఉందన్న సంకేతాలను సీఎం ఇచ్చినట్లు సన్నిహిత వర్గాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రస్తుతం హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న బీఆర్ఎస్ నేత పాడి కౌశిక్‌రెడ్డి పై అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. కౌశిక్‌రెడ్డి పై చర్యలు తీసుకుని ఎమ్మెల్యే పదవికి అనర్హత వస్తే హుజూరాబాద్ కు ఉపఎన్నిక తప్పదన్న చర్చ మొదలైంది. అయితే ఎథిక్స్ కమిటీ తుది నిర్ణయం ఇంకా వెలువడలేదు. సెప్టెంబర్ 30న కమిటీ మరోసారి సమావేశం కానున్న నేపథ్యంలో ఉత్కంఠ నెలకొంది. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఇప్పటికే ఉపఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్ పార్టీ మార్పుపై తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 18న అనర్హత వేటు వేయగా.. సెప్టెంబర్ 24న సుప్రీంకోర్టు కూడా ఆ తీర్పునే సమర్థించింది. అనంతరం అసెంబ్లీ సీటును ఖాళీగా ప్రకటించింది. దీంతో ఖైరతాబాద్ లో ఉపఎన్నికకు మార్గం సుగమమైంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక పై స్పష్టత వచ్చిన సమయంలోనే హుజూరాబాద్ పేరు తెరపైకి రావడం ఆసక్తి రేపుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్నిహితులతో హుజూరాబాద్ లో ఉపఎన్నిక జరిగే అవకాశం ఉందన్నట్లుగా వ్యాఖ్యానించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే అది అధికారిక ప్రకటన కాదు. కౌశిక్‌రెడ్డి పై ఎథిక్స్ కమిటీ నిర్ణయం, తదనంతరం పరిణామాల పై ఆధారపడి ఉంటుంది. హుజూరాబాద్ ఉపఎన్నిక అంశం ముందుకు వచ్చే అవకాశం ఉందన్న చర్చ ప్రస్తుతం కొనసాగుతోంది. ఇక ఎథిక్స్ కమిటీ నిర్ణయం వెలువడేంతవరకు అందరూ వేచి చూడాల్సిందే.

## కష్టపడే తత్వానికి ప్రత్యామ్నాయం లేదు

**హనుమకొండ, భీమారం మహా ;** ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ల సహకారంతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ లో భాగంగా స్క్రీనింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన 560 మంది అభ్యర్థులకు శిక్షణా తరగతుల నిర్వహణ పై ముందస్తు సమావేశం భీమారంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ మాట్లాడుతూ, గతంలో నిర్వహించిన ఉచిత కోచింగ్ ద్వారా పలువురు పోలీస్ ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ప్రణాళికాబద్ధంగా కష్టపడి, క్రమశిక్షణతో చదివితే విజయం సాధించవచ్చని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో మధ్యవర్తులను నమ్మి డబ్బులు చెల్లించి మోసపోవద్దని సూచించారు. అభ్యర్థులు కోచింగ్‌ను సద్వినియోగం చేసుకొని క్రమం తప్పకుండా తరగతులకు హాజరై ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, అడిషనల్ డీసీపీ సురేష్, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, కేయూసీ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ANN తెలుగు

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్
30-09-2026

మహా ప్రత్యేకం

04



## గడ్డపార చేతబట్టి.. డొంక రోడ్డుకు
# శ్రీకారం

**ఉదయగిరి,మహా:** గడ్డపారలు చేతబట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ డొంక రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా ఉదయగిరి నియోజకవర్గం పరిధిలోని కొకులవారిపల్లి గ్రామంలో పొలాల మధ్య నిర్మించనున్న డొంక రోడ్డుకు ముగ్గురు నేతలు శ్రమదానం ద్వారా పనులు ప్రారంభించారు. శ్రామికులతో కలిసి శ్రమదానండొంక రోడ్డు పనుల ప్రారంభంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గడ్డపారలు చేతబట్టి మట్టిని తవ్వారు. అనంతరం గ్రామానికి చెందిన వీబీ జీ రాంజీ శ్రామికులు గంపలతో మట్టిని తీసుకెళ్లి రోడ్డు నిర్మాణానికి ఉపయోగించారు. శ్రాtమికులతో కలిసి ముగ్గురు నేతలు పనుల్లో పాల్గొన్నారు.

### కొకులవారిపల్లిలో శ్రమదానం చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్. పొలాల మధ్య డొంక రోడ్డుకు పనులు ప్రారంభం... పల్లెపండుగ అభివృద్ధి పనుల పరిశీలన.





**167 నియోజకవర్గాల్లో డొంక రోడ్లు**

పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా డొంక రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. పైలట్ ప్రాజెక్టు కింద గ్రామీణ ప్రాంతాలు ఉన్న 167 నియోజకవర్గాల పరిధిలో ఒక్కో నియోజకవర్గానికి ఒక డొంక రోడ్డు నిర్మించనున్నారు. ఇందులో భాగంగా ఉదయగిరి నియోజకవర్గంలోని కొకులవారిపల్లిలో నిర్మించనున్న డొంక రోడ్డు పనులను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి శ్రమదానం ద్వారా ప్రారంభించారు.

**అభివృద్ధి పనుల పరిశీలన**

డొంక రోడ్డు పనులకు శ్రీకారం చుట్టే ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కొకులవారిపల్లి గ్రామంలో పల్లెపండుగ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను కాలినడకన పరిశీలించారు. గ్రామంలో చేపట్టిన వివిధ పనులను పరిశీలిస్తూ ముందుకు సాగారు.

**నీటి తొట్టెతో స్వాగతం**

గ్రామ సరిహద్దుల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టె ముగ్గురు నేతలకు స్వాగతం పలికింది. అనంతరం గ్రామంలో వేసిన బీటీ రోడ్డు, నిర్మించిన సీసీ రోడ్డు, రహదారికి సమీపంలో ఏర్పాటు చేసిన మినీ గోకులాన్ని వారు పరిశీలించారు. రోడ్డు నిర్మాణ నాణ్యతను కూడా తనిఖీ చేశారు.

**కిలోమీటరు మేర కాలినడకన పర్యటన**

కొకులవారిపల్లి గ్రామంలో సుమారు కిలోమీటరు మేర ముగ్గురు నేతలు కాలినడకన పర్యటించారు. అభివృద్ధి పనులను పరిశీలిస్తూ గ్రామ సచివాలయం వరకు వెళ్లారు. అక్కడ వీబీ జీ రాంజీ శ్రామికులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

**పూల జల్లులతో ఘన స్వాగతం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కొకులవారిపల్లి గ్రామానికి రావడంతో గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ సరిహద్దుల వద్ద మహిళలు పూల జల్లులతో నేతలకు స్వాగతం పలికారు. మహిళలతో ముగ్గురు నేతలు ముచ్చటిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ గ్రామంలోకి నడిచి వెళ్లారు.

**వేదికపై ర్యాంప్‌పై నడుస్తూ అభివాదం**

పల్లెపండుగ 3.0 కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సభా వేదిక వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ప్రజలు తమ మెడల్లోని కండువాలను గాల్లో ఊపుతూ జయజయ ధ్వానాలు చేశారు. అనంతరం చంద్రబాబు, పవన్ కల్యాణ్, పీవీఎన్ మాధవ్ వేదిక వద్ద ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై నడుస్తూ ప్రజలకు అభివాదం చేశారు.

**అభిమానుల సందడి**

నేతలను చూసేందుకు వచ్చిన మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. అభిమానులు తమ ఫోన్లలో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. పల్లెపండుగ కార్యక్రమానికి ముందు గ్రామాల్లో ఉన్న పరిస్థితులు, పల్లెపండుగ అనంతరం చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ రూపొందించిన వీడియో ప్రజెంటేషన్ సభికులను ఆకట్టుకుంది.

**పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక స్వాగతం**

పల్లెపండుగ 3.0 కార్యక్రమానికి ఉదయగిరి నియోజకవర్గాన్ని ఎంపిక చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై స్థానిక ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. జనసేన జెండా రంగులతో కూడిన గొడుగులతో ప్రత్యేకంగా స్వాగతం పలికారు. పవన్ కల్యాణ్‌కు స్వాగతం తెలుపుతూ ఆంగ్ల అక్షరాల ఆకృతిలో నిలబడి తమ అభిమానాన్ని, కృతజ్ఞతలను వ్యక్తం చేశారు.



**గ్రామీణ అభివృద్ధికి పల్లెపండుగ**

పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి పనులు చేపడుతున్నారు. కొకులవారిపల్లిలో డొంక రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు స్వయంగా శ్రమదానం చేయడంతో కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది. గ్రామస్థులు, వీబీ జీ రాంజీ శ్రామికులతో కలిసి నేతలు పనులను ప్రారంభించారు.

---





# ఉదయగిరిలో పల్లెల్లో నవోదయం

- **దేశంలోనే నెంబ్ వన్ గా ఏపీ పంచాయతీరాజ్**
- **రూ. 11,085 కోట్ల భారీ అంచనా వ్యయంతో 'పల్లె పండుగ 3.0**
- **ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా పవన్ సంకల్పం**

(మహా ప్రత్యేకం)

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ. 11,085 కోట్ల భారీ అంచనా వ్యయంతో 'పల్లె పండుగ 3.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని పారదర్శకంగా, ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళ్లే లక్ష్యంతో ఈ పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. పల్లెపండుగ మొదటి దశ, రెండో దశ సూపర్ హిట్ కాగా, ఇపుడు మూడో దశకు శ్రీకారం చుట్టారు. పల్లెల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాది. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడేలా, ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా సమగ్ర అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది" అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రహదారులు, తాగు నీరు, వ్యవసాయం, ఉపాధి, పరిశుభ్రత, మౌలిక వసతులతోపాటు పర్యాటక రంగానికీ ప్రాధాన్యం ఇస్తూ గ్రామీణ ప్రాంతాల రూపు రేఖలు మార్చే లక్ష్యంతో 'పల్లె పండుగ 3.0'కు శ్రీకారం చుట్టామని తెలిపారు. పల్లె బలపడితేనే రాష్ట్ర భవిష్యత్తు బలపడుతుందనే సంకల్పంతో ప్రతి పల్లెను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

**ముఖ్యమైన వివరాలు:**

- మొత్తం అంచనా వ్యయం: రూ. 11,085 కోట్లు (కేంద్ర వాటా రూ. 5,391 కోట్లు, రాష్ట్ర వాటా రూ. 5,694 కోట్లు).
- రోడ్ల నిర్మాణం: రూ. 2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, రూ. 7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణం.
- పాడి రైతులు & ఉద్యానవనం: రూ. 300 కోట్లతో 22,000 మిని గోకులాల నిర్మాణం, రూ. 225 కోట్లతో 50,000 ఎకరాల్లో తోటల పెంపకం చేపట్టనున్నారు.
- ఇతర అభివృద్ధి పనులు: రూ. 110 కోట్లతో 1,000 కిలోమీటర్ల మేజిక్ డ్రెయిన్లు, రూ. 200 కోట్లతో బస్ షెల్టర్లు, పంచాయతీ భవనాలు మరియు రచ్చ బండల నిర్మాణాలు జరగనున్నాయి







## విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎంపీడీవో జలంధర్ రెడ్డి

**వలిగొండ సెప్టెంబర్ 29 మహా న్యూస్** : మండలంలోని లొతుకుంటలో బాలికల హాస్టల్‌ను మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి సందర్శించి హాస్టల్‌లోని పరిసరాలను, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. హాస్టల్‌లో నిర్వహిస్తున్న సరుకుల నాణ్యత, పరిమాణాన్ని స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో ఫుడ్ కమిటీ సభ్యులతో మాట్లాడి హాస్టల్‌లో వారికి ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యతపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అలాగే ఆదివారం రోజు కూడా తప్పనిసరిగా స్టాఫ్ అందుబాటులో ఉండాలి అని సూచించారు.మధ్యాహ్న భోజన సమయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి విద్యార్థులతో కలిసి గ్రామ సర్పంచ్ రాములు విద్యార్థులకు భోజనం వడ్డించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారికి అందుతున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన ఆహారం అందేలా సంబంధిత సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రాంతి హాస్టల్ స్టాఫ్ పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన నాసిరకం మట్టి.. ప్రజల ఆవేదన

- నాణ్యమైన ఎర్రమట్టితో సైడ్ బెర్మ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్



పాలకుర్తి, సెప్టెంబర్ 29 పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలోని పాలకుర్తి మండలంలో బసంత్‌నగర్ నుంచి పాలకుర్తి వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర కొత్తగా రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అయితే రోడ్డు పక్కన సైడ్ బెర్మ్‌ల నిర్మాణానికి నాసిరకం మట్టిని వినియోగిస్తున్నారంటూ గ్రామ ప్రజలు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన నాణ్యమైన ఎర్రమట్టిని వినియోగిస్తే రహదారి మరింత పటిష్టంగా ఉండటంతో పాటు వాహనాల రాకపోకలకు, ప్రజల ప్రయాణానికి అనుకూలంగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు. నాసిరకం మట్టిని వినియోగించడం వల్ల వర్షాకాలంలో రోడ్డు పక్కభాగాలు కోతకు గురై దెబ్బతినే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, సైడ్ బెర్మ్‌లకు నాణ్యమైన ఎర్రమట్టిని వినియోగించాలని గ్రామ ప్రజలు, ప్రయాణికులు సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను కోరుతున్నారు.

## పాలకవర్గం వైఫల్యంపై బి ఆర్ ఎస్ సమరం!

- దుమ్ముతో నిండిన పెద్దపల్లి రోడ్లు.. ప్రజలకు తప్పని ఇబ్బందులు
- బిఆర్ఎస్ జిల్లా పట్టణ అధ్యక్షులు
- రోడ్లపై చీపుర్లు పట్టి నిరసన తెలిపిన నాయకులు



**పెద్దపల్లి, మహా** : పెద్దపల్లి పట్టణంలో రోడ్ల పరిశుభ్రతపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ బి ఆర్ ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. మంగళవారం బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజకుమార్ నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ కేంద్రం పక్కన ఉన్న రహదారిపై చీపుర్లు పట్టుకుని రోడ్లను ఊడ్చి నిరసన తెలిపారు .ఈ సందర్భంగా ఉప్పు రాజకుమార్, మాజీ కౌన్సిలర్ లైశెట్టి బిక్షపతి మాట్లాడుతూ.. "ఇది పెద్దపల్లి పట్టణమా.. లేక దుబ్బపల్లి పట్టణమా అర్థం కావడం లేదు" అంటూ మున్సిపల్ పాలకవర్గం, అధికారుల తీరుపై విమర్శలు చేశారు. మాతా శిశు సంరక్షణ కేంద్రం, ఆర్.కే. ఆసుపత్రి, పిల్లల దావాఖానా, జూనియర్ కళాశాల, పలు పాఠశాలలు ఉన్న ఈ ప్రాంతంలో ప్రతిరోజూ చిన్నారులు, రోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. అలాంటి కీలక రహదారి దుమ్ము, ధూళితో నిండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రతిరోజూ ఉదయం రోడ్లను శుభ్రం చేసే కార్యక్రమం జరిగేదని, ప్రస్తుతం ఆ ప్రక్రియ నిలిచిపోయిందని వారు ఆరోపించారు. కమాన్ రోడ్డు, జెండా రోడ్డు, సాగర్ రోడ్డు, కూనారం రోడ్డు, టీచర్స్ కాలనీ, బస్టాండ్ రోడ్డు తదితర ప్రాంతాల్లో దుమ్ము, ధూళి పేరుకుపోయిందని పేర్కొన్నారు. రోడ్లపై దుమ్ము కారణంగా ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని ప్రధాన రహదారులను ప్రతిరోజూ శుభ్రం చేయడంతో పాటు అవసరమైన చోట నీటిని పిచికారీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం కేవలం ఫొటోలు, ప్రచారం కోసం కాదని, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకే చేపట్టామని ఉప్పు రాజకుమార్ తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన పట్టణంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ వెన్నం సుజాతరవీందర్, మాజీ కౌన్సిలర్లు లైశెట్టి బిక్షపతి, పూదరి చంద్రశేఖర్, ఖదీర్ ఖాన్, కనుకుర్తి కార్తీక్, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎండీ ఫహీం, జావీద్, నాయకులు పల్లె మధు, కొంతం సురేష్, బొడ్డుపల్లి రమేష్, వైద శ్రీనివాస్, మహబూబ్, నుగిళ్ళ వీరేశం, జుబేర్, అజార్, పెంచాల శ్రీకాంత్, పొలం సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి బకాయిల చెల్లింపులపై బిజెపి లడాయి

- శాంతిఖని గని ఆవరణలో కార్మికులకు వివరించిన బిజెపి



**బెల్లంపల్లి,మహా**: సింగరేణి బకాయిల చెల్లింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగరేణి బకాయిలు.. బిజెపి లడాయి అనే కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మంగళవారం నాడు శాంతిఖనీ గని ఆవరణలో కార్మికులకు బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అమ్మరాజుల శ్రీదేవి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగరేణి కార్మికులకి అండగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్ రావ్ ఆధ్వర్యంలో బుధవారం రోజున సిసి ఎక్స్ రోడ్లో పెట్రోల్ పంపు వద్ద ఉదయం ధర్నా కార్యక్రమం జరుగుతుందని కార్యక్రమానికి మద్దతుగా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులు పట్టి వెంకట కృష్ణ,జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్ కుమార్, బెల్లంపల్లి మండల అధ్యక్షులు ఉప సర్పంచ్ గజ్జెల్లి రాజ్ కుమార్ ,మహిళా మోర్చా నిర్మల్ జిల్లా ఇన్చార్జ్ అడ్వకేట్ నల్లుల సంగీత,బెల్లంపల్లి పట్టణఉపాధ్యక్షులు బాసబోయిన యుగంధర్, బి ఎం ఎస్ నాయకులు శ్రీనివాసరాజు, నాయకులు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలివ్వాలి

- ఈఎస్ఐ వైద్య సేవలు అందరికీ వర్తింపజేయాలి
- డిప్‌సైడ్ గనిని సింగరేణి కార్మికులతోనే నడపాలి..
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబుకు ఐఎఫ్‌టీయూ వినతి



**మణుగూరు, మహా** : సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ సిఫార్సుల మేరకు వేతనాలు అమలు చేయడంతో పాటు ఈఎస్ఐ వైద్య సేవలను తక్షణమే అందుబాటులోకి తేవాలని ఐఎఫ్‌టీయూ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సహకారంతో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులకు నాయకులు వినతిపత్రం అందజేశారు. మణుగూరు పీకేఓసీ డిప్‌సైడ్ గనిని సింగరేణి సంస్థకే కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ గనిని ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా సింగరేణి కార్మికులతోనే నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.డి. నాసర్ పాషా మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా వివిధ గనులు, విభాగాల్లో సుమారు 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు, ఓబీ వర్కర్లు పనిచేస్తున్నారని తెలిపారు. సింగరేణి ఉత్పత్తి, ఉత్పాదకత పెంపులో శాశ్వత కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులు శ్రమిస్తున్నప్పటికీ వారికి తగిన వేతనాలు, సంక్షేమ సౌకర్యాలు అందడం లేదన్నారు. చిరు జీతాలతో కుటుంబాలను పోషించుకోవడం కాంట్రాక్ట్ కార్మికులకు భారంగా మారిందని, ఎన్నేళ్లుగా సమస్యలు పరిష్కారం కాకుండా 'గొర్రె తోక బెత్తెడు' అన్న చందంగా పరిస్థితి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. హైపవర్ కమిటీ సిఫార్సుల ప్రకారం నిర్ణయించిన వేతనాలను ఎలాంటి జాప్యం లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి క్యాంటీన్లలో టీ, టిఫిన్, భోజన సదుపాయాలకు కాంట్రాక్ట్ కార్మికులకు తగిన బడ్జెట్ కేటాయింపు లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. శాశ్వత కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులకు కూడా క్యాంటీన్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఈఎస్ఐ వైద్య సేవలు అందుబాటులోకి రాలేదని పేర్కొన్నారు. కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులందరికీ ఈఎస్ఐ వైద్య సదుపాయం వర్తించేలా ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా విధి నిర్వహణ సమయంలో జరిగే ప్రమాదాలకు మాత్రమే కాకుండా సహజ మరణం, విధులకు బయట జరిగే ప్రమాదాల సందర్భాల్లోనూ బీమా పథకం వర్తించేలా సమగ్ర ప్రమాద బీమా విధానాన్ని రూపొందించాలని కోరారు. కార్మికుడు మృతి చెందిన సందర్భంలో అతని కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకుండా తగిన బీమా పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు, వైద్యం, క్యాంటీన్, బీమా తదితర సంక్షేమ సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.డి. నాసర్ పాషా, ఐఎఫ్‌టీయూ నాయకులు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో గురుకుల విద్యా అస్తవ్యస్తం

- మహిళలకు విద్యార్థినిలకు భద్రత కరువు.!
- ఫిర్యాదులు చేసిన స్పందించని అధికారులు.?
- వారిపై చట్ట ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలి.?
- సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 29 మహా**: విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఘటనపై తక్షణమే స్పందించి, సంబంధిత అధికారుల నుంచి నివేదిక తెప్పించుకుని, విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించాలని సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం చర్లపటేల్‌గూడ బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలో, డాటా ఎంట్రీ ఆపరేటర్ మహిళా సిబ్బంది, విబద్యార్థులపై అసభ్యకరంగా ప్రవర్తించాడని, విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన, ఇచ్చిన ఫిర్యాదులపై స్పందించని విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధి తీరుపై సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పాఠశాలలో నెలకొన్న పరిస్థితులు...?**

చర్లపటేల్‌గూడలోని బీసీ, మైనారిటీ గురుకుల క్యాంపస్‌లో విద్యార్థుల భద్రతకు సంబంధించిన తీవ్ర ఆరోపణలు, లైంగిక వేధింపులపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే శ్రీమతి *సబితా ఇంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, పార్టీ నాయకులతో కలిసి పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ శ్రీలతతో మాట్లాడి పాఠశాలలో నెలకొన్న పరిస్థితులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇటీవల వచ్చిన ఫిర్యాదులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ఫిర్యాదులు చేసిన స్పందించని అధికారులు....?**

విద్యార్థులు, సిబ్బంది నుంచి, సమస్యలపై పలు మార్లు ఫిర్యాదులు వచ్చినప్పటికీ సంబంధిత విద్యాశాఖ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తగిన స్థాయిలో స్పందించకపోవడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గురుకుల విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని వారు స్పష్టం చేశారు.

**చట్ట ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలి...?**

విద్యార్థులపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు నిజమైతే, వాటిపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కుంటున్న డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఈ రోజు బీఆర్ఎస్ బృందం వస్తుందని తెలిసి క్యాంపస్ కు రాకుండా తప్పించుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు, అలాగే మహిళల క్యాంపస్ లో పురుష సిబ్బందిని ఎలా నియమించారని ప్రశ్నించారు. విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఘటనపై తక్షణమే స్పందించి, సంబంధిత అధికారుల నుంచి నివేదిక తెప్పించుకుని, విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించాలని సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## జర్నలిస్టుల సమస్యలపై ఆందోళన తప్పదు

- టియుడబ్ల్యూజె కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి

**కుషాయిగూడ, మహా**: జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే ఆందోళన బాట తప్పదని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి హెచ్చరించారు. ఉప్పల్ నియోజకవర్గం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం మల్లాపూర్ లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏమాత్రం చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన పేరుతో జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఆరోగ్య భద్రతపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ఇప్పటికైనా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ లు వచ్చేలా సంఘం పాటుపడిందని స్పష్టం చేశారు. ఐక్యమత్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో అతిపెద్ద సంఘంగా జర్నలిస్టుల సంక్షేమం కోసం మన సంఘం ఎప్పుడు ముందుంటుందని స్పష్టం చేశారు. జిల్లా కార్యదర్శి డి వెంకట్ రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి.మల్కయ్య, జిల్లా ఉపాధ్యక్షులు రాంప్రసాద్ శర్మ, కేసీ మోహన్, పంజాల శ్రీనివాస్ గౌడ్, అక్బర్, ఆదిమూలం శ్రీనివాస్, రంగు మల్లేష్, రమేష్, జిల్లా హెల్త్ కమిటీ కన్వీనర్లు కొలనుపాక చంద్రమౌళి, విజయ్ లు, టీయూడబ్ల్యూజే ఉప్పల్ నియోజకవర్గ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ డి సురేష్, ఉపాధ్యక్షులు రుద్రగోని నర్సింగ్, కోశాధికారి వేముల శంకర్, ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల తిరుపతిరెడ్డి, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జ్యోతిర్మయ చారి, ఉప్పల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్, నియోజకవర్గంలోని జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సేవా సభ్యుల సేవాభావం స్ఫూర్తిదాయకం

- శ్రీ విద్యాభ్యాస పాఠశాలకు 50 కిలోల బియ్యం అందజేత..
- విద్యార్థులకు సహపంక్తి భోజనం, స్వీట్ల పంపిణీ..
- సేవా కార్యదర్శి షేక్ షాకీరా ప్రశంస

**మణుగూరు, మహా** : సమాజంలోని అవసరమైన వారికి తమ శక్తి మేరకు చేయూతనందిస్తూ సింగరేణి సేవా సభ్యులు చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిదాయకమని మణుగూరు ఏరియా సేవా కార్యదర్శి షేక్ షాకీరా రవూఫ్ అన్నారు. మణుగూరు ఏరియా సేవా సభ్యురాలు పులిశెట్టి సంధ్యాబాబు కుటుంబం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ విద్యాభ్యాస పాఠశాల విద్యార్థులకు సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాలకు 50 కిలోల బియ్యం అందజేయడంతో పాటు విద్యార్థినీ విద్యార్థులకు సహపంక్తి భోజనం ఏర్పాటు చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షేక్ షాకీరా రవూఫ్ మాట్లాడుతూ, వ్యక్తిగత సందర్భాలను సామాజిక సేవకు వేదికగా మలుచుకుని తోటి వారికి ఉపయోగపడాలనే ఆలోచన అభినందనీయమన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన మేరకు అవసరంలో ఉన్న వారికి చేయూతనిస్తే మానవతా విలువలు మరింత బలపడతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నారులకు ఆహారం, విద్య తదితర అంశాల్లో సహకారం అందించడం గొప్ప సేవగా నిలుస్తుందన్నారు. లండన్‌లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న సాయి విహారి కుటుంబ సభ్యులు ఆమె వ్యక్తిగత సందర్భాన్ని సేవా కార్యక్రమంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ బాబు, సంధ్య దంపతులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సేవా సభ్యులు చింతల మాధవి, వరలక్ష్మి, సిద్ధాంతి శ్రీనివాస్, మనోజ్ కుమార్, శ్రీ విద్యాభ్యాస పాఠశాల నిర్వాహకులు బి జగన్మోహన్ రెడ్డి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆటో ప్రమాదంలో మరో యువతి దుర్మరణం

### ఐదుకు చేరిన మృతుల సంఖ్య

**మంచిర్యాల, మహా** : నస్పూర్ గేట్ వద్ద లారీ ఢీకొన్న ఆటో ప్రమాదంలో చికిత్స పొందుతున్న మరో యువతి దివ్యవాణి మంగళవారం మృతి చెందింది. దీంతో మృతుల సంఖ్య 5కు చేరింది.నిన్న (సోమవారం) జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు యువతులు మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్ర గాయాలతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దివ్యవాణి పరిస్థితి విషమించి కన్నుమూసింది. ఆటో డ్రైవర్ తో పాటు మరో ఇద్దరు ప్రయాణికులు గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. సోమవారం ఉదయం మందమర్రి మండలం పొన్నారం, గుడిపల్లి గ్రామాలకు చెందిన 7 మంది మహిళలు మంచిర్యాల షాపింగ్ మాల్‌లో పనికి ఆటోలో వెళ్తుండగా నస్పూర్ గేట్ వద్ద బైక్‌ను తప్పించబోయి లారీ ఢీకొట్టింది. చింతకుంట్ల లక్ష్మి, అగ్గు సౌందర్య స్పాట్ లో, సోనియా, సుమలత ఆసుపత్రిలో మృతి చెందారు.



## హరిప్రసాద్ జ్ఞాపకార్థం విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు

**కుషాయిగూడ, మహా** : చర్లపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న 85 మంది విద్యార్థుల పరీక్ష రుసుమును విద్యుత్ సౌధ విశ్రాంత ఉద్యోగి సిరిపురం రంగయ్య తన దివంగత కుమారుడు సిరిపురం హరిప్రసాద్ జ్ఞాపకార్థం అందజేశారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల పదో తరగతి పరీక్ష రుసుమును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణకు అందించారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ తన కుమారుడు హరిప్రసాద్ జ్ఞాపకార్థం విద్యార్థులకు తనవంతు సహాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రానున్న ఎస్ఎస్‌సీ పరీక్షలకు కష్టపడి చదవాలని సూచించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వనం విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు ఆంగ్ల భాషపై పట్టు అవసరమని అన్నారు. పాఠశాల విద్యార్థుల కోసం ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. విద్యార్థులు ఈ తరగతులను సద్వినియోగం చేసుకుని తమ భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల పరీక్ష రుసుమును అందజేసిన రంగయ్యకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# సత్తా చాటాలి జిల్లా పేరు నిలపాలి

**జూడో పోటీలలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాంక్ష**

**ఆదిలాబాద్ మహా:** జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తుండటం జిల్లాకు గర్వకారణమని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. తెలంగాణ స్పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన జూడో పోటీలకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీలను ప్రారంభించి ఆసక్తిగా తిలకించారు. జూడోలో సత్తాచాటి బ్రెజిల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారుడు హర్షవర్ధన్ ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురిని శాలువాలతో సత్కరించి అబినందించారు.ఈ కార్యక్రమంలో డీవైఎస్వో దయానంద్ రెడ్డి, డీఈవో మాధవి, జూడో క్రీడాకారులు , కోచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**చెన్నూర్, మంచిర్యాల :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం చెన్నూర్‌లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ, ఇతర పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులు తుది దశకు చేరాయని, త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదుల నిర్మాణం, వంటశాలలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం, నాణ్యమైన విద్య అందించాలని ఆదేశించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో గోదావరి పుష్కరాలు 2027 ఏర్పాట్లపై సమీక్షించారు. ఘాట్ నిర్మాణం, రహదారుల మరమ్మత్తు, సౌకర్యాల కల్పనపై చర్చించి రైతులు సహకరించాలని కోరారు.

# డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ గాబాధ్యతలు చేపట్టిన అంబటి శ్రీనివాస్

**రాజేంద్రనగర్ మహా :** డి ఎల్ పి ఓ సతీష్ రెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో అంబటి శ్రీనివాస్ మంగళవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. బాధ్యత చేపట్టిన డివిజనల్ పంచాయతీ అధికారిని వివిధ గ్రామాల నాయకులు సర్పంచులు, శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థులకు నోటు బుక్కులను పంపిణీ

**రాజేంద్రనగర్ మహా :** గ్రేటర్ శంషాబాద్ పరిధి కొత్వాల్ గూడ డివిజన్ లోని ఇందిరానగర్ దొడ్డి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మాజీ ఉపసర్పంచ్ కృష్ణ కుమార్ తన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం విద్యార్థులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులకు అవసరమైన పెన్నులు పెన్సిళ్లు నోటుబుక్కులు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు ఉపయోగపడే అవసరమైన వస్తువులను పంపిణీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో వారికి అవసరమైన మరిన్ని వస్తువులను అందజేయడానికి తన వంతు సహకారం ఉంటుందన్నారు.




# పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

- రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు
- ముందస్తు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం
- అధికారులకు కలెక్టర్ రాజర్షి షా పలు ఆదేశాలు



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లాలో పత్తి కొనుగోళ్లను పారదర్శకంగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోళ్ల ముందస్తు ఏర్పాట్లపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు, సీసీఐ ప్రతినిధులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, రైతు సంఘాల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అక్టోబర్ రెండో వారంలో సీసీఐ, ప్రైవేట్ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించేలా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జిన్నింగ్ మిల్లుల వివరాలను యాప్‌లో నమోదు చేసి, రైతులను సంబంధిత మిల్లులకు ట్యాగింగ్ చేసే ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, నీడ, తూకం తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో మాయిశ్చర్ మీటర్లను సక్రమంగా వినియోగించేలా వీఓలు, గ్రేడర్లు, సీసీఐ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. రైతులు, వీఓలు, గ్రేడర్లతో స్థానిక పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసి తేమ శాతం కొలతల్లో పారదర్శకత పాటించాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి వ్యవసాయ, మార్కెటింగ్, సీసీఐ అధికారులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పత్తి రవాణాకు సంబంధించి ఆర్అండ్‌బీ, జాతీయ రహదారులు, గ్రామపంచాయతీ రహదారుల పరిస్థితిని సమీక్షించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మార్కెట్ యార్డుల్లో తూకం, షెడ్లు, నీరు తదితర సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు.

**భద్రత కట్టుదిట్టం**

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, జిన్నింగ్ మిల్లుల్లో కంప్యూటర్ ఆపరేటర్లు పనిచేసే ప్రాంతాలు, ప్రవేశ ద్వారాల వద్ద సీసీ కెమెరాలు 100 శాతం పనిచేసేలా చూసి రికార్డులను భద్రపరచాలని సూచించారు. పత్తి మిల్లుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చిన్న ట్రేడర్లు, మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా రైతుల నుంచే కొనుగోళ్లు జరిగేలా చూడాలని సూచించారు. గతేడాది కంప్యూటర్ ఎంట్రీల సమయంలో చోటుచేసుకున్న పొరపాట్లు పునరావృతం కాకుండా సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలని తెలిపారు. పత్తి కొనుగోళ్ల సీజన్‌లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు.

**ఏర్పాట్లు సవ్యంగా..**

మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ, మార్కెట్ యార్డుకు వచ్చే మహిళా రైతులకు ప్రత్యేక టాయిలెట్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. మార్కెట్ సమీపంలోని ప్రాంతాల దృష్ట్యా రైతులు, మహిళలకు భద్రత కల్పించేలా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాల కారణంగా పత్తి తడిసి రైతులు నష్టపోకుండా మార్కెట్‌కు తీసుకొచ్చిన పత్తిని సకాలంలో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**సంసిద్ధంగా ఉండాలి..**

మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ, మార్కెట్‌కు వచ్చే రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. మార్కెట్ పరిసరాల్లో మున్సిపాలిటీ, జిన్నింగ్ అసోసియేషన్, సీఎస్ఆర్ నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సీజన్ పూర్తయ్యే వరకు రాత్రివేళ పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. జిన్నింగ్ మిల్లుల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు, ఎన్ఓసీలు, అగ్నిమాపక పరికరాల పనితీరును తనిఖీ చేయాలని కోరారు.

**సమస్యలు లేకుండా..**

రైతులు పంటల కొనుగోలు, మద్దతు ధర, మార్కెట్ యార్డ్ రవాణా సౌకర్యాలకు సంబంధించి ఎదురవుతున్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు కోరారు. గతంలో పత్తి కొనుగోలు సందర్భంగా ఎదురైన ఇబ్బందులు ఈసారి మళ్లీ రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ యార్డ్‌లలో కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు సిబ్బంది కొరత లేకుండా తాత్కాలిక ఉద్యోగులను నియమించాలన్నారు.జిల్లాలోని మార్కెట్ యార్డుల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఉట్నూర్ సబ్ కలెక్టర్ కొయ్యాడ ప్రణయ్ కుమార్, మార్కెటింగ్ ఏడీ గజానంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, సి సి ఐ బ్రాంచ్ మేనేజర్ పునీత, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, కమిషన్ ఏజెంట్లు, ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, రైతు సంఘాల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మహాదినపత్రికకథనానికిస్పందన

- మామిడిగట్టు పాఠశాలలో ఎంఈఓ విచారణ
- ఉపాధ్యాయుల తీరుపై మహా కథనానికి స్పందించిన విద్యాశాఖ
- మామిడిగట్టు పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించిన ఎంఈఓ రమేష్ రాథోడ్
- షోకాజ్ నోటీసులు జారీ చేసి సమగ్ర విచారణ జరుపుతామని స్పష్టీకరణ




**మందమర్రి/మంచిర్యాల, మహా:** గత శనివారం మహా దినపత్రికలో ప్రచురితమైన ఉపాధ్యాయుడు ఇలా.. విద్యార్థులు అలా..! సంచలనాత్మక కథనానికి ఎట్టకేలకు స్పందన లభించింది. పత్రికలో వచ్చిన వార్తను తీవ్రంగా పరిగణించిన మందమర్రి మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) రమేష్ రాథోడ్ సోమవారం మామిడిగట్టు ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు.

ఉదయం 9 గంటలకే పాఠశాలకు చేరుకున్న ఎంఈఓ.. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన సిబ్బందితో విచారణ ప్రారంభించారు. గత శనివారం పాఠశాలకు ఎంతమంది ఉపాధ్యాయులు హాజరయ్యారు..? ఆ రోజు అసలు ఏం జరిగింది..? ముఖ్యంగా ఒక ఉపాధ్యాయుడు పాఠశాల వేళల్లో కుర్చీలో కూర్చొని టేబుల్ పై తలవాల్చి నిద్రలోకి జారుకున్న వైనంపై ఆయన ఆరా తీశారు. ఈ విషయాలపై కూపీ లాగుతూ పాఠశాల ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులను కూడా విడివిడిగా విచారించారు. పాఠశాలలో నెలకొన్న అసలు సమస్యలు, లోపాలను అడిగి తెలుసుకున్నారు.

**షోకాజ్ నోటీసులు తప్పవు**

సోమవారం మామిడిగట్టు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నెలకొన్న ఘటనపై జరిగిన విచారణ గురించి మహా దినపత్రిక ప్రతినిధి ఎంఈఓ రమేష్ రాథోడ్ ను వివరం కోరగా ఆయన స్పందిస్తూ పాఠశాలలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయులకు తక్షణమే షోకాజ్ నోటీసులు అందజేస్తామని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు తలెత్తితే ఉపాధ్యాయులు, గ్రామస్తులు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఎంఈఓ కోరారు.

**పిల్లలను ఉపాధ్యాయులు గమనించడం లేదు**

పాఠశాలకు వచ్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు సరిగ్గా గమనించడం లేదని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని మందమర్రి ఎంఈఓ దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లినట్టు సమాచారం. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సైతం నిత్యం పాఠశాలకు రాకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని, పిల్లలకు టాయిలెట్లు, అందులో కనీస నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. అలాగే, మధ్యాహ్న భోజనంలో వెంట్రుకలు, పురుగులు వస్తున్నాయని తదితర అంశాలతో కూడిన వినతి పత్రాన్ని గ్రామస్తులు ఎంఈఓకు అందజేసినట్లు తెలుస్తోంది.

**మామిడిగట్టు పాఠశాల పై విచారణ చేపట్టాలి : టీవీజెఎస్**

శనివారం మామిడిగట్టు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుల తీరుపై ఎంఈఓ, ఇతర ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని టీవీజెఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బచ్చలి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థులకు బోధన సరిగా చేయడం లేదని ఆయన ఆరోపించారు. మహా దినపత్రికలో వచ్చిన కథనంపై స్పందించి విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# సత్తుపల్లిఅభివృద్ధికిరూ.5కోట్లుమంజూరు

- సింగరేణి పరిధిలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి, సెప్టెంబరు 29:** మహా : సింగరేణి పరిధిలోని సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి పనులకు రూ.5 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ తెలిపారు. నియోజకవర్గ సమస్యలు, మౌలిక వసతుల అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో నిధులు మంజూరైనట్లు ఆమె పేర్కొన్నారు. సింగరేణి పరిధిలోని నియోజకవర్గాల అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారంపై హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో జరిగిన ఈ సమావేశానికి సింగరేణి పరిధిలోని ఎమ్మెల్యేలు, జెన్‌కో, ట్రాన్స్‌కో, సింగరేణి సంస్థల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**నియోజకవర్గ సమస్యలపై చర్చ**

సత్తుపల్లి నియోజకవర్గంలోని సింగరేణి సంబంధిత సమస్యలు, మౌలిక వసతుల అవసరాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే సమావేశంలో వివరించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. తన ప్రతిపాదనలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అయితే దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు లేదా ప్రభుత్వ ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది.

**ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు**

నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడంపై ఎమ్మెల్యే రాగమయి దయానంద్ హర్షం వ్యక్తం చేశారు. మంజూరైనట్లు ప్రకటించిన నిధులను ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి పనులకు ప్రాధాన్యతా క్రమంలో వినియోగిస్తామని తెలిపారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్యేలు, జెన్‌కో, ట్రాన్స్‌కో, సింగరేణి సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# భూగర్భ జలాలను రక్షించాలి : కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ మహా:** వాటర్ ప్లాంట్ యజమానులు నీటి వృధాను అరికట్టేలా చర్యలు చేపట్టాలనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పురపాలక శాఖ ఆధ్వర్యంలో నీటి వినియోగంపై మినరల్ వాటర్ ప్లాంట్ యజమానులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన భూగర్భ జలాల అక్రమ తవ్వకం, నీటి వృధాను అరికట్టడం, ప్లాంట్ల నిర్వహణపై స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూగర్భ జలాలు విపరీతంగా అడుగంటుతున్న నేపథ్యంలో ప్లాంట్ల నిర్వహణదారులు తక్షణమే అప్రమత్తం కావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ బోర్వెల్స్ చుట్టూ విధిగా రీచార్జ్ స్ట్రక్చర్స్ లేదా కమ్యూనిటీ సోక్‌పిట్స్ ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా వృధా అయ్యే నీటిని తిరిగి భూగర్భంలోకి మళ్లించడానికి వీలవుతుందని స్పష్టం చేశారు. ప్లాంట్లు నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో నీటి నమూనా పరీక్షలు విధిగా జరిపించుకోవాలని ఆదేశించారు. అలాగే ట్రేడ్ లైసెన్సులు, మున్సిపల్ అనుమతులు లేని వారు వెంటనే వాటిని రెన్యువల్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా నూతన వాటర్ ప్లాంట్లను పట్టణం బయట మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీటి సంరక్షణకు జల సంచాయ్ జన్ బాగీధారి, జలసిరి వంటి కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నాయని, నీటి వృధాను అరికట్టడంలో వ్యాపార యజమానులు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్. రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషా, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మినరల్ వాటర్ ప్లాంట్ యజమానులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




# బుగ్గ గ్రామంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం..

- 5 సీఎస్ఆర్‌లో భాగంగా ఎస్ఎంఎస్ లిమిటెడ్ ఏర్పాటు..
- గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

**మణుగూరు, మహా :** మణుగూరు మండలం బుగ్గ గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, శుద్ధమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో సంచేతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఎంఎస్ లిమిటెడ్ కేపీయూజీ మైన్ యాజమాన్యం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను మంగళవారం ప్రారంభించారు. సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.2.20 లక్షల వ్యయంతో, గంటకు 500 లీటర్ల శుద్ధజల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్‌ను బుగ్గ గ్రామంలో ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలనే సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు, సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీటి సదుపాయం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో అవసరమన్నారు. ఆర్వో ప్లాంట్ ద్వారా గ్రామస్తులకు నాణ్యమైన తాగునీరు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా గ్రామాల అభివృద్ధి, ప్రజల ప్రాథమిక అవసరాల కల్పనకు సంస్థ సహకారం కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మణుగూరు ఎంపీడీవో ఎం శ్రీకాంత్, ఎంపీఈవో పల్నాటి వెంకటేశ్వర్లు, సంస్థ జీఎం సీహెచ్ నరసింహరావు, ప్రాజెక్ట్ మేనేజర్ ఈ తిరుపతి, హెచ్ఆర్ మేనేజర్ ఎం. శ్రీహరి రావు, బుగ్గ గ్రామపంచాయతీ సర్పంచ్ శెట్టిపల్లి మాధవి, ఎస్ఎంఎస్ లిమిటెడ్ సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# బహిరంగ సభకు ప్రజలందరూ కదం తొక్కాలి

- 3 వేల బైకులతో ముఖ్యమంత్రి కి ఘన స్వాగతం పలుకుతాం
- కౌన్సిలర్ తూము మధు

**వేములవాడ,మహా:** బుధవారం సిరిసిల్లలో సిరిసిల్లలో జరగబోయే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు ప్రజలందరూ కదం తొక్కాలని కౌన్సిలర్ తూము మధు వేములవాడ పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని ముఖ్య కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం నాలుగు గంటలకు జరగబోయే బహిరంగ సభకు కౌన్సిలర్లు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, పెద్ద ఎత్తున రైతులు మహిళలు, యువకులు, అభిమానులు ప్రజలందరూ పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 3 వేల బైకులతో ఘన స్వాగతం పలికి వేములవాడ కాంగ్రెస్ బలం చూపుతామని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించేందుకే ఈ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.అంతేకాకుండా వేములవాడ పట్టణంలో రాజన్న ఆలయానికి 250 కోట్ల నిధులు వెచ్చించి ఆలయ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకత్వంలో పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోచమ్మ మైదాన్ లో ఆటోల బీభత్సం

- నడిరోడ్డు పైనే నిలిపివేత.. ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం!
- స్థానికుల పై ఆటో డ్రైవర్ల ఝులుం!
- సెలవుల్లో అధికారి పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

**వరంగల్, బ్యూరో, మహా** : వరంగల్ నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన పోచమ్మ మైదాన్ లో ఆటోల బీభత్సం రోజురోజుకూ పెరిగిపోతోంది. నడిరోడ్డు పైనే ఆటోలను అడ్డంగా నిలిపి ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. అయినా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారిక ఆటో స్టాండ్ ఉన్నప్పటికీ, నలుగురైదుగురు ఆటో డ్రైవర్లు తమ ఆటోలను ఏకంగా రోడ్డు మధ్యలోనే నిలిపి కొంతమంది ఆటో డ్రైవర్లు మద్యం సేవించి ఆటోలు నడపడమే కాకుండా ఆటోలో కూర్చుని గేమ్స్ ఆడుకుంటూ ఒక ఆటోను మరో ఆటో తో తోసుకుంటూ, స్థానికంగా ఉన్న వ్యాపార సముదాయాల ముందర నిలుపుతూ వారితో వాగ్వివాదానికి దిగుతూ వెనుక నుంచి వచ్చే వాహనాలకు కనీసం దారి కూడా ఇవ్వడం లేదు. ఈ ప్రాంతం నుంచి ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఆటోలు ఇలా నడిరోడ్డు పై నిలపడం వల్ల భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ద్విచక్ర వాహనదారులు, పెద్ద వాహనాలు, అంబులెన్స్ లు కూడా వెళ్లలేక అవస్థలు పడుతున్నాయి. మరో దారుణం ఏంటంటే ఆటోల ఇష్టా రాజ్యాన్ని చూస్తూ కూడా అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ అధికారి ట్రాఫిక్ నియంత్రణ పై నిర్లక్ష్య ధోరణి జంక్షన్ల పై పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఆటో డ్రైవర్ల ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది. ప్రస్తుతం అధికారి సెలవుల్లో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికైనా వరంగల్ పోలీస్ కమిషనర్ స్పందించి, పోచమ్మ మైదాన్ లో నిత్యం ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్న ఆటోల పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, వ్యాపారులు కోరుకుంటున్నారు.




## రైతులేకుంటే మనిషి మనుగడే సాధ్యపడదు

- రోజురోజుకు సాగు తగ్గిపోవటం ఆందోళనకరం
- అన్నదాతల సంక్షేమం కోసమే ప్రభుత్వ ప్రతీ నిర్ణయం
- ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి

**ఆదిభట్ల సెప్టెంబర్ 29 మహా**: రోజురోజుకు సాగు తగ్గిపోతుండటం ఆందోళనకరమని...రైతు లేకుంటే మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటుందన్న ఆయన... ఇందులో భాగంగా తుర్కయంజాల్ సహకార బ్యాంకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం 55వ సర్వసభ్య సమావేశం ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన జరగ్గా... ఎమ్మెల్యే మల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్యాంకు సాధించిన లాభాలకు సంబంధించిన గణాంకాలను ఈ సందర్భంగా పాలకవర్గం ఎమ్మెల్యేకు వివరించగా... ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం, పలువురు రైతులకు వ్యవసాయ పనిముట్లను, చెక్కులను మల్‌రెడ్డి చేతుల మీదుగా అందజేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి మాట్లాడుతూ తొలినుంచి తుర్కయంజాల్ సహకార బ్యాంకు పనితీరు అత్యుత్తమంగా ఉంటుందని గుర్తుచేశారు. బ్యాంకు సాధించిన లాభాలను ఏ రూపంలోనైనా రైతు కోసమే ఖర్చుచేయాలని ఆయన సూచించారు. పాలకవర్గం విజ్ఞప్తి మేరకు సహకార సంఘానికి భూములిప్పించే బాధ్యత తనదన్న ఎమ్మెల్యే... గోడౌన్లు, కోల్ట్ స్టోరేజీలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, నాణ్యమైన ఆయిల్ ఉత్పత్తి కోసం నూనెగింజల ప్రాసెసింగ్‌పై దృష్టి సారించాలని పాలకవర్గానికి ఆయన సూచనలు చేశారు. దేశంలోనే అతిపెద్ద సమీకృత మార్కెట్ కోహెడలో ఏర్పాటవుతుందన్న ఎమ్మెల్యే... ఇది పూర్తైతే ఇక్కడి ప్రజలకు ఉపాధికి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## డంపింగ్‌యార్డులో సౌకర్యాలు కల్పించాలి

**కుషాయిగూడ, మహా**: ఆదర్శనగర్ డంపింగ్‌యార్డులో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ రిక్షా కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. రాంకీ సంస్థ, కాప్రా జీహెచ్ఎంసీ అధికారులు కార్మికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. రోజుకు రెండు ట్రిప్పులు చేయాల్సి ఉండగా.. డంపింగ్‌యార్డులో సరైన సదుపాయాలు లేకపోవడంతో ప్రస్తుతం ఒక్క ట్రిప్పు మాత్రమే చేయగలుగుతున్నామని కార్మికులు తెలిపారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను, రాంకీ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. ధర్నాలో కోట రమేష్, కోట నరసింహ, సూరారం నరసింహ, బొనుగుల నరసింహ, సురేష్, కోట కిషన్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## కుషాయిగూడ డిపోలో ఐక్య కూటమి ప్రచారం

### కార్మికుల మద్దతు కోరిన టిడబ్ల్యుయూ గౌరవ అధ్యక్షురాలు

**కుషాయిగూడ, మహా** : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఇందులో భాగంగా కుషాయిగూడ ఆర్టీసీ డిపోలో బాణం గుర్తు అభ్యర్థి అశ్వద్ధామ రెడ్డి బలపరిచిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడబ్ల్యుయూ గౌరవ అధ్యక్షురాలు బొంతు శ్రీదేవి యాదవ్ డిపోలోని ఉద్యోగులు, కార్మికులతో సమావేశమై యూనియన్ కార్యక్రమాలు, కార్మికుల సమస్యలపై చర్చించారు. టిడబ్ల్యుయూ-ఎస్డబ్ల్యూఎఫ్ ఐక్య కూటమి అభ్యర్థులకు మద్దతు ఇచ్చి, బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కార్మికులను కోరారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని శ్రీదేవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యుయూ డిపో కార్యదర్శి ఎ. మల్లికార్జున్, డిపో అధ్యక్షుడు టి. శ్రీనివాస్ గౌడ్, ఎస్డబ్ల్యూఎఫ్ కార్యదర్శి చి. ఉపేందర్, అధ్యక్షుడు సోమయ్య, మహిళా నాయకులు కౌసల్య, రోజా, సుధా, సంధ్య, శాంత తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ వేడుకలు

**మంచిర్యాల, మహా** : అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 1న ఉదయం 10 గంటలకు నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయంలో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, గౌరవప్రద జీవనం, సామాజిక భద్రతపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలపై వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అధికారులు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## సింగరేణి లో 76 జీఓ పట్టాల సమస్యకు పరిష్కారం

- రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సమావేశం



**బెల్లంపల్లి ,మహా**: సింగరేణి ప్రాంతంలో దశాబ్దాల కాలంగా నివసిస్తూ నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలు లేక పట్టాలు లేని కారణంగా తీవ్ర ఇక్కట్లను కార్మికులు కార్మికేతల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అధ్యక్షతన మంగళవారం నాడు సమావేశంలో నిర్వహించగా కోల్డ్ బెల్ట్ ప్రాంతానికి సంబంధించిన ఎమ్మెల్యేలు ఆయా ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు .బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కలిసి జీవో నెంబర్ 76 ను పునరుద్ధరించి సంబంధిత భూములకు పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికులు ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న క్వార్టర్స్‌ను నివాసం ఉంటున్న వారే సొంతం చేసేలా చర్యలు తీసుకోవాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కి విన్నవించారు.హైదరాబాద్ ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియా ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో సింగరేణి కార్మికుల సమస్యలపై సుమారు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగాచర్చ జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ నియోజకవర్గంలోని సింగరేణి 76 జీఓ పట్టాల సమస్యతో పాటు,స్టేషన్ రోడ్ కాలనీ తదితర ప్రాంతాల్లో సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికులు నివసిస్తున్న క్వార్టర్స్ సమస్యను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు.ఏళ్ల తరబడి సింగరేణి సంస్థకు సేవలందించిన కార్మికులు, రిటైర్డ్ కార్మికులకు వారు నివసిస్తున్న క్వార్టర్స్‌పై హక్కు కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి నియోజకవర్గానికి ఒక నోడల్ అధికారిని నియమించి, ఆయా ప్రాంతాల్లోని క్వార్టర్స్ సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి, అర్హులైన కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి విజ్ఞప్తి పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు .ఈ సమావేశంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్,భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య,కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు,సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి , ఐ ఎన్ టి యు సి సెక్రటరీ జనరల్ డా.బి.జనక్ ప్రసాద్, సింగరేణి సీఎండీ, డైరెక్టర్ పా, మందమర్రి జీఎం రాధాకృష్ణ తో పాటు కోల్‌బెల్ట్ ప్రాంతానికి చెందిన జిఎం లు పాల్గొన్నారు.

## కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో డీఐజీ ఆకస్మిక తనిఖీ

**పెద్దపల్లి మహా** : కాళేశ్వరం: కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం కాళేశ్వరం జోన్ I డీఐజీ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన అధికారులు, సిబ్బంది పని తీరును సమీక్షించి, వివిధ రికార్డులను తనిఖీ చేశారు. ఎస్ఐ, స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్ వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో నేరాలు, శాంతిభద్రతలు, గ్రామాల పరిస్థితి, స్టేషన్ నిర్వహణపై ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, బాధితులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఐజీ సూచించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీట్‌లో ఉన్న వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు.

రాష్ట్ర సరిహద్దు పోలీస్‌స్టేషన్ కావడంతో సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజల భద్రతకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని డీఐజీ అంబర్ కిషోర్ ఝా సూచించారు.



## కార్మికుల హక్కుల కోసం ఐ.ఎన్.టి.యు.సి నిరంతర పోరాటం

**మందమర్రి, మహా** : కార్మికుల హక్కుల సాధన కోసం ఐఎన్టీయూసీ నిరంతరం పోరాడుతుందని ఏరియా ఉపాధ్యక్షులు దేవీ భూమయ్య అన్నారు. కాసిపేట2 గనిలో పిట్ కార్యదర్శి కారుకూరి తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా ఉపాధ్యక్షులు దేవీ భూమయ్య, ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవీ భూమయ్య మాట్లాడుతూ గని అధికారుల తీరుతో కార్మికులు తీవ్ర మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ విభాగాన్ని జనరల్ షిఫ్ట్‌లో కలపడం వల్ల ఉత్పత్తికి విఘాతం కలుగుతుందన్నారు. భూగర్భ గనుల్లో పనిచేసే కార్మికులకు సరైన రక్షణ పరికరాలు ఇవ్వకుండా పని చేయిస్తున్నారని మండిపడ్డారు.గతంలో సింగరేణి బి.ఐ.ఎఫ్.ఆర్. లోకి వెళ్లినప్పుడు పెద్దపల్లి ఎంపీ కాకా వెంకటస్వామి, జనక్ ప్రసాద్ ఢిల్లీ నేతలతో మాట్లాడి 463 కోట్ల రూపాయల పెట్టుబడితో సంస్థను కాపాడారని గుర్తుచేశారు. కార్మికులకు నాణ్యమైన సేఫ్టీ పరికరాలు, పనిముట్లు సకాలంలో అందించాలని, లేనిపక్షంలో హక్కుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పిట్ సెక్రటరీ రవికిరణ్, బండారి శంకర్, కొప్పుల ఓదెలు, సత్తయ్య, భాస్కర్, దోసల శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి నిర్వహణ పేరుతో మొక్కలనరికివేత

**రాజేంద్రనగర్ మహా** ; తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తుంటే, మైలార్దేవ్పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జీహెచ్ఎంసీ అధికారులు సిబ్బంది తో చెట్లను విచక్షణారహితంగా నరికివేస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండడంతో కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లోకిఉదయాన్నే జాగింగ్, వాకింగ్, యోగ, మరిన్ని క్రీడల కోసం క్రీడాకారులు భారీగా తరలివస్తున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఉన్నత ఆశయాలకు, క్షేత్రస్థాయి అధికారుల ప్రవర్తనకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఈ సన్నివేశం స్పష్టం చేస్తున్నాయి. వన మహోత్సవంలో జీహెచ్ఎంసీ పరిధిలోని పార్కులు, ఖాళీ స్థలాలు, చెరువు గట్లపై లక్షలాది మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఒకవైపు కొత్త మొక్కలు నాటేందుకు కోట్లాది రూపాయల బడ్జెట్ కేటాయిస్తున్న ప్రభుత్వం, మరోవైపు నాటిన చెట్లను కాపాడటంలో విఫలమవుతోందని పర్యావరణ ప్రేమికులు మండిపడుతున్నారు. అభివృద్ధి నిర్వహణ పేరుతో నరికివేత చేపడుతున్నారు.వాల్టా చట్టం ప్రకారం ఒక చెట్టును నరికితే దానికి బదులుగా కొత్త మొక్కలు నాటాలనే నిబంధన ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం కేవలం మొక్కలు నాటే సంఖ్యపైనే కాకుండా, నగరానికి ఊపిరితిత్తులుగా ఉన్న పాత చెట్లను రక్షించడం పై కూడా కఠినమైన నిబంధనలు అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## జెన్‌కో కేంద్రాలకు రోజుకు 75,500 టన్నుల బొగ్గు సరఫరా

- లక్ష్య సాధనకు సింగరేణి, జెన్‌కో ప్రత్యేక కార్యాచరణ
- ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ దృష్ట్యా ఉన్నత స్థాయి సమీక్ష
- రైలు మార్గంలో 56 వేలు, రోడ్డు మార్గంలో 19,500 టన్నుల రవాణాకు ప్రణాళిక
- గత ఏడాదితో పోలిస్తే ఇప్పటివరకు 31 శాతం అధికంగా బొగ్గు సరఫరా




**మంచిర్యాల, మహా** : రాష్ట్రంలో ఎల్ నినో పరిస్థితుల కారణంగా పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేసేందుకు సింగరేణి, తెలంగాణ జెన్‌కో సంస్థలు సంయుక్తంగా సమగ్ర కార్యాచరణను రూపొందించాయి. జెన్‌కో కేంద్రాలకు రోజువారీగా 75,500 టన్నుల బొగ్గు సరఫరా లక్ష్యంగా మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఒక ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఇరు సంస్థల ఉన్నతాధికారులు, సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్లు, జెన్‌కో విద్యుత్ కేంద్రాల చీఫ్ ఇంజినీర్లు (సీఈలు) పాల్గొన్నారు. విద్యుత్ కేంద్రాల వారీగా బొగ్గు అవసరాలు, ప్రస్తుతం జరుగుతున్న సరఫరా, నాణ్యత, రైల్వే రేకుల అందుబాటు, లోడింగ్ -అన్‌లోడింగ్ ప్రక్రియలు, రవాణాలో ఎదురవుతున్న చిన్నపాటి ఇబ్బట్లపై సుదీర్ఘంగా చర్చించారు.రైలు, రోడ్డు మార్గాల ద్వారా పంపిణీ ఇలా రోజువారీగా 14 రైల్వే రేకుల ద్వారా 56 వేల టన్నులు, రోడ్డు మార్గం ద్వారా 19,500 టన్నుల బొగ్గును సరఫరా చేయాలని ప్రణాళిక ఖరారు చేశారు. విద్యుత్ కేంద్రాల వారీగా ఉన్న డిమాండ్‌ను బట్టి కొత్తగూడెం కేంద్రానికి 24 వేల టన్నులు, కాకతీయకు 4,500 టన్నులు, భద్రాద్రికి 15 వేల టన్నులు, యాదాద్రి కేంద్రానికి 34 వేల టన్నుల బొగ్గు కేటాయింపులపై సమీక్ష జరిపారు. ముఖ్యంగా యాదాద్రి ప్లాంట్ అవసరాల కోసం ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి రెండు రేకుల ద్వారా రోజుకు 8 వేల టన్నులు, స్థానిక సింగరేణి గనుల నుంచి ఆరు రేకుల ద్వారా 36 వేల టన్నులు రవాణా చేసేలా తగిన చర్యలు చేపట్టారు. నైనీ నుంచి సరఫరాను మరింత పెంచేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

**గత ఏడాదితో పోలిస్తే 31 శాతం వృద్ధి**

గతఈ నెల 28 నాటికి జెన్‌కో కేంద్రాలకు రోడ్డు, రైలు మార్గాల ద్వారా మొత్తం 15.02 లక్షల టన్నుల బొగ్గును సరఫరా చేసినట్లు సింగరేణి మార్కెటింగ్ శాఖ అధికారులు వెల్లడించారు. గత ఏడాది ఇదే సెప్టెంబరు నాటికి 11.44 లక్షల టన్నులు మాత్రమే సరఫరా కాగా, ఈసారి అదనంగా 3.58 లక్షల టన్నులు సరఫరా చేశామని, ఇది సుమారు 31 శాతం పెరుగుదలను సూచిస్తోందని వివరించారు. ఎల్ నినో పరిస్థితుల వల్ల వర్షాభావం ఏర్పడి, రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని, దీనికి తగినట్లుగా ఉత్పత్తిని నిరంతరం కొనసాగించేందుకు అదనపు బొగ్గు అవసరమని జెన్‌కో అధికారులు తెలిపారు.

**సమన్వయంతోనే లక్ష్య సాధన**

బొగ్గు సరఫరా, రవాణా స్వీకరణలో ఎటువంటి అంతరాయాలు కలగకుండా సంబంధిత ఏరియా జీఎంలు, ప్లాంట్ల సీఈలు పరస్పర సమన్వయంతో వ్యవహరించాలని సీఎండీలు సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా వాట్సప్ గ్రూపులు, ఫోన్ కాల్స్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని మార్పిడి చేసుకోవాలని ఆదేశించారు. రేకుల సమీకరణతో పాటు లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ప్లాంట్ల సీఈలు, బొగ్గు సరఫరా చేసే ఏరియాల జీఎంలతో ఇలాంటి సంయుక్త సమన్వయ సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.ఈ సమావేశంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), జీఎం (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు

- ఎన్నికల ముందు ఘన్సిమీయాగూడ లో 50 ఎకరాలు తనకిస్తే పట్టాలు ఇస్తానని కమిట్మెంట్ అయ్యారు కేటీఆర్.
- 15 సంవత్సరాలుగా మంత్రిగా ఉండి బహదూర్గుడా రైతులకు పట్టాలిచ్చారా....
- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్రా



**జేంద్రనగర్ మహా** : శంషాబాద్ లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తన అనుచరులతో కలసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. శంషాబాద్ లోని బహదూర్ గూడ భూములు, గాన్సిమియా గూడా సంబంధించిన పైగా భూ మస్యలపై నేను గతంలో ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని మంత్రులను సంప్రదించి సమస్యను పరిష్కరించాలని కోరాను. 18 సంవత్సరాలుగా నిరంతరం ప్రభుత్వంలో ఉన్న ప్రతి ముఖ్యమంత్రి దగ్గరికి బహదూర్ గూడ,ఘన్సిమీయాగూడ, కోత్వాల్ గూడ, భూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ప్రతి ముఖ్యమంత్రిని కోరామన్నారు. ఏ ముఖ్యమంత్రి ఈ భూ సమస్యను పరిష్కరించలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ భూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తుంటే, బిఆర్ఎస్ మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు కేటీ రామారావు, సబితా ఇంద్రారెడ్డి బహదూర్ గూడా రైతులను రాజకీయాలకు వాడుకుంటున్నారు. రాష్ట్ర మంత్రిగా 15 సంవత్సరాలు ఉన్న సబితా ఇంద్రారెడ్డి జిల్లాను శాసించారు. బహదూర్ గూడా రైతుల భూములు కనిపించలేవా అని ఎద్దేవ చేశారు. సబితా ఇంద్రారెడ్డి మాజీ మంత్రిగా ఉండి కూడా బహదూర్గుడా రైతులను పట్టించుకోలేదన్నారు. మంత్రిగా ఉండి చేయని పనులు ప్రభుత్వం ఏర్పడ్డాక చేస్తామని చెప్పడం నమ్మశక్యం లేదన్నారు.మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి ఈ భూ సమస్యలను తీసుకువచ్చా, చేద్దాం చూద్దామని కాలం గడిపారు. అసెంబ్లీలో ప్రస్తావించ చీఫ్ సెక్రటరీకి విన్నవించ, ప్రతి కలెక్టర్ చుట్టూ, ఆర్డీవో చుట్టూ, తిరిగి తిరిగి అలసిపోయాను. కెసిఆర్ ప్రభుత్వంలో మాజీ మంత్రి కేటీ రామారావు ఘన్సిమీయాగూడ భూములలో 50 ఎకరాలు తమకుఇస్తే చేస్తానని కమిట్మెంట్ అయ్యారు. తర్వాత కాలంలో ప్రభుత్వం రాకపోవడంతో ఘన్సిమీయాగూడ భూముల పంచాయతీ మొదటికి వచ్చింది అన్నారు. ఎప్పుడూ సంప్రదించలేదనీ, అసలు ఆ విషయమే పట్టించుకోలేదనీ మాజీమంత్ర కేటీఆర్ నాపై అసత్య ఆరోపణలు చేశారు. పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. 22 డిసెంబర్ 2022 రోజు అప్ప జంక్షన్ వద్ద శంషాబాద్ ఎయిర్పోర్ట్ వరకు మెట్రోకు శాకుస్థాపన చేసిన సందర్భంలో జరిగిన బహిరంగ సభలో సబా వేదిక సాక్షిగా నేను ఈ సమస్యను కెసిఆర్, కేటీఆర్ దృష్టికి తెచ్చాను. అసలు ఈ భూ సమస్యలు మా దృష్టికి తిసుకరాలేదని, మా దృష్టికి తెస్తే అప్పుడే పరిష్కారం చూపే వారిమీఅంటున్నారు. ఒక మంత్రిగా ఉండి ఎమ్మెల్యే పైన అసత్య ఆరోపణలు చేయడం మీ విజ్ఞతకే వదిలేస్తా అన్నారు. ప్రభుత్వం 500 గజాలు ఇస్తానంటున్నారు. ప్రభుత్వంతో ముఖ్యమంత్రి కొట్లాడైనా సరే ఎకరాకి 600 గజాల భూమిని ఇప్పిస్తానన్నారు. 1200 వందల ఎకరాల భూమిలో 600 ఎకరాల భూమికి పట్టా లిప్పిస్తానన్నారు. మిగతా 600 ఎకరాల భూమి ప్రభుత్వాన్నిదన్నారు. కేవలం బహాదుర్ గూడ భూములే కాకా ఇంక శంషాబాద్ మండలం లో ఉన్న కోత్వాల్ గూడ లోని ఎనిమి ప్రాపర్టీస్ గురించి అలాగే భూదాన్ భూములు సుల్తాన్ పల్లి, మల్కారం, జూకల్, రామంజపూర్, పెద్ద గోల్కొండ, చౌదరిగుడా, నర్కుడా, పెద్ద షాపూర్, అత్తాపూర్ లోని భూపాల్ నగర్, జలాల్ బాబా నగర్, రాజేంద్రనగర్ లోని హనుమాన్ నగర్, గండిపేట్ మండలంలోని వట్టినాగులపల్లి తదితర ప్రాంతాల్లో ఉన్న భూ మస్యలపై గత ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని, మంత్రులను పలు మార్లు కలిసి వినతి పత్రాలు ఇచ్చి భూ సమస్యల పరిష్కారం చూపాలని కోరాను. రాజకీయ విమర్శలు చేయాలంటే చేయండి రైతులను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయాలనుకోవడం రాష్ట్ర మాజీ మంత్రిగా మీకు శ్రేయస్కరం కాదున్నారు. తెలంగాణ భవన్లో రైతులతో మాట్లాడమన్నారు. మీతో మాట్లాడిన వారు రైతులేనా ఒకసారి ఆలోచించుకోవాలన్నారు.



# ఓటరు జాబితా ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- మంచిర్యాల అదనపు కలెక్టర్ వి రాములు
- మందమర్రిలో ఏఈఆర్ఓలు, బీఎల్ఓలతో సమీక్షా సమావేశం
- నిర్దేశిత గడువులోగా, పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని ఆదేశం

**మందమర్రి మహా** : మంచిర్యాల జిల్లాలో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను మరింత వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు అధికారులను ఆదేశించారు. మంగళవారం మందమర్రి పట్టణంలోని కె.ఆర్. గార్డెన్స్‌లో మందమర్రి తహసిల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు సిబ్బందితో కలిసి ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లతో ఆయన ఒక ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామోలీస్ సంబంధిత ఓటర్లకు ఇప్పటికే నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించడం ద్వారా తమ ఓటు హక్కును ధ్రువీకరించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఓటర్లు సమర్పించిన ఈ ధ్రువపత్రాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా వేగం పెంచాలని అధికారులను కోరారు. ప్రతి దశను నిబంధనల ప్రకారం, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని సూచించారు. గడువులోగా ఎస్ఐఆర్ పనులను విజయవంతం చేసేందుకు ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు పరస్పర సమన్వయంతో పని చేయాలని, ఎక్కడైనా పెండింగ్ పనులు ఉంటే వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టంగా జరగాలి

- ప్రధాన రహదారులు, డివైడర్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి

**జిడబ్ల్యూఎంసి కమిషనర్ వెంకన్న**

**వరంగల్, కార్పొరేషన్ మహా** : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని విలీన గ్రామాలతో పాటు నగరంలోని ప్రధాన రహదారులు, అప్రోచ్ రోడ్లు, డివైడర్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణను పటిష్టంగా చేపట్టి, ఎక్కడా పారిశుద్ధ్య లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం వడ్డేపల్లి చర్చి నుంచి ఉనికిచర్ల ఔటర్ రింగ్ రోడ్డు వరకు బల్దియా పరిధిలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహదారుల వెంట, డివైడర్ల వద్ద పరిశుభ్రతను పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు.డివైడర్లలో మొక్కలు ఎండిపోకుండా, ఖాళీలు ఏర్పడకుండా తగిన నిర్వహణ చేపట్టాలని, డివైడర్ల కింద మట్టి పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. రహదారులు, డివైడర్లు లేదా ఇతర ప్రాంతాల్లో ఏవైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా గృహిణులతో మాట్లాడిన కమిషనర్, స్వచ్ఛ ఆటోలు ప్రతిరోజూ తమ ప్రాంతాలకు వస్తున్నాయా, తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారా, చెత్త సేకరణ సేవలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు.

**పారిశుద్ధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి**

విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ స్పష్టం చేశారు. గ్రామాల నుంచి నగరానికి అనుసంధానమయ్యే ప్రధాన రహదారులు, అప్రోచ్ రోడ్లు, డివైడర్లు సక్రమంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రోడ్ల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి గ్యాప్స్ లేకుండా రోజువారీగా మానిటరింగ్ చేపట్టాలని తెలిపారు.పారిశుద్ధ్య కార్మికులందరూ విధి నిర్వహణ సమయంలో తప్పనిసరిగా యూనిఫామ్ ధరించి, నిర్దేశిత సమయపట్టిక ప్రకారం విధులు నిర్వహించాలని, క్రమం తప్పకుండా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని సూచించారు. సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలోని ప్రాంతాలను నిత్యం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా పరిశీలించాలని ఆదేశించారు. అదేవిధంగా ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు డీస్లడ్జింగ్ వాహనాలను క్రమం తప్పకుండా పంపించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. సంబంధిత వాహనాల రాకపోకలు, డీస్లడ్జింగ్ ప్రక్రియను సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.



**ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలి**

నగరంతో పాటు విలీన గ్రామాల్లోనూ ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా పారిశుద్ధ్య వ్యవస్థను మరింత పటిష్టంగా నిర్వహించాలని కమిషనర్ అధికారులకు స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఈఈ సంజయ్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విదేశీ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి!

పెద్దపల్లి మహా, జిల్లాలోని నిరుద్యోగ యువత విదేశాల్లో లభిస్తున్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టుమాకామ్) ఆధ్వర్యంలో జర్మనీ, ఇజ్రాయెల్, ఆస్ట్రియా, ఐర్లాండ్, సౌదీ అరేబియా, ఖతార్, దుబాయ్, ఆస్ట్రేలియా, అమెరికా తదితర దేశాల్లో వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నర్సింగ్, ఫిజియోథెరపీ, డ్రైవింగ్, నిర్మాణ రంగం, వెల్డింగ్, ఎలక్ట్రికల్, వ్యవసాయం తదితర విభాగాల్లో ఉద్యోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం, కలెక్టరేట్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, రూమ్ నంబర్ 233లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08035524946, 8125737731, 9291237999, 0423342040 నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

**పెద్దపల్లి మహా** : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టి, రోడ్డు భద్రత ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అరుణశ్రీతో కలిసి రోడ్డు భద్రత చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. పెద్దపల్లి పట్టణంలోని ప్రధాన జంక్షన్ల వద్ద ఉన్న ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. రోడ్డు విస్తరణకు అవసరమైన చర్యలు చేపడుతూ వీధి వ్యాపారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని డివైడర్లు, యూటర్న్‌లను పరిశీలించి ప్రమాదాల నివారణకు తగిన మార్పులు చేయాలని తెలిపారు. సుల్తానాబాద్-కాట్నపల్లి మార్గంలోని నిరుకుళ్ల వద్ద గ్రామసభ తీర్మానం మేరకు అవసరమైన చోట యూటర్న్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రామగుండం నగరంలో అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు.రోడ్డుపై పశువులను వదిలే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, రూ.10 వేల వరకు జరిమానా విధించి పశువులను గోశాలలకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. రహదారుల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని, పట్టణ ప్రాంతాల్లో రోడ్డు స్ట్రిప్స్, రేడియం స్టిక్కరింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పాఠశాల వద్ద తప్పనిసరిగా స్కూల్ జోన్ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. లారీలు, ట్రాక్టర్లు, ఇతర భారీ వాహనాలతో పాటు కార్ల ముందు, వెనుక భాగాల్లో రేడియం స్టిక్కర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలను త్వరగా పంపించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం, అతివేగం వంటి కారణాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, రోడ్డు భద్రతా ప్రమాణాలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ భావ్ సింగ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పవిత్ర, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి!

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి మహా** : ప్రజలకు ప్రభుత్వ సేవలను సత్వరంగా, సమర్థవంతంగా అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా, నిర్ణీత గడువులోగా సేవలు అందించాలని సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాల నిర్వహణ తీరును, సిబ్బంది హాజరును, రికార్డుల నిర్వహణను, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఆయా విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఫిర్యాదుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి స్వీకరించే దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలకు సంబంధించిన సమాచారం ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా కార్యాలయాల్లో ఫైళ్లు, రికార్డులను క్రమపద్ధతిలో భద్రపరచాలని, అవసరమైన రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. కార్యాలయ గదులతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ప్రజల సమస్యలను నిబంధనల మేరకు పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల సిబ్బంది మర్యాదగా వ్యవహరిస్తూ, వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. ప్రభుత్వ సేవలపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా పారదర్శకంగా, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించలేని ప్రజా ప్రభుత్వం

- పదవుల పై ఉన్న శ్రద్ధ తూర్పు ప్రజా సమస్యల పై లేదా?
- బిజెపి జిల్లా అధ్యక్షులు గంట, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి
- గుమ్మడికాయలు కొట్టి దిష్టి తీసి నిరసన తెలిపిన బిజెపి శ్రేణులు

**వరంగల్, మహా** : వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యేను నిలదీస్తూ బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆధ్వర్యంలో ఓ సిటీ క్యాంపు కార్యాలయం నుంచి నూతన వరంగల్ జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద నిరసనలో భాగంగా బూడిద గుమ్మడికాయలు కొట్టి దిష్టి తీసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ.. భవనం నిర్మాణం పూర్తయినా నూతన వరంగల్ జిల్లా కలెక్టరేట్ ను ఎందుకు ప్రారంభించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లా వరంగల్‌లో ఉన్నప్పుడు ప్రజలు ప్రతి ప్రభుత్వ పనికోసం హన్మకొండ కు వెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందని నిలదీశారు. ఏ శాఖ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక ప్రజలు తిరగాల్సి వస్తోందని, తమ సమస్యలు చెప్పుకోవడానికి కూడా హన్మకొండ చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కుటుంబంలో ఎవరికి ఏ పదవి రావాలి.. ఎవరు ఎమ్మెల్సీ కావాలి.. ఎవరు ఎమ్మెల్యే కావాలి అనే ఆరాటం ఉంటే, మీ కుటుంబానికి ఎన్ని పదవులు కావాలో అన్ని పదవులు తీసుకోండి.. చివరికి ముఖ్యమంత్రి పదవి కూడా మీరే తీసుకోండి. కానీ మిమ్మల్ని గెలిపించిన వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలకు మీరు ఏం న్యాయం చేస్తున్నారు?" అని ప్రదీప్ రావు సూటిగా ప్రశ్నించారు. నెలలో కనీసం 20 రోజులైనా తూర్పు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు వినే బాధ్యత మీకు లేదా? అధికారంలో ఉన్నప్పుడు పదవులు కావాలి.. కానీ ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన సమయానికి ప్రజలకు అందుబాటులో ఉండరా?" ఇలాగే చేస్తే రాబోయే రోజుల్లో మీ యొక్క క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని అని హెచ్చరించారు.

మంత్రి పదవి ఉన్నా ప్రజలకు ఒరిగిందేమీ లేదు!

మంత్రి పదవిలో ఉన్నప్పుడు ఇటు ప్రజలకు అటు నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదని ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఘాటుగా విమర్శించారు. కాకతీయుల చారిత్రక రాజధాని అయిన వరంగల్‌లో నిర్మించిన నూతన కలెక్టరేట్ ముందు కాకతీయ కీర్తి తోరణం లేకపోవడం కూడా ప్రజల మనోభావాలను దెబ్బతీసే అంశమన్నారు. కలెక్టరేట్ ను వెంటనే ప్రారంభించి, జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాలను వరంగల్‌లో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదవుల కోసం రాజకీయాలు చేయడం కాదు.. ప్రజల కోసం పనిచేయండి, గెలిపించిన తూర్పు ప్రజలకు ఇకనైనా అందుబాటులోకి రండి, పూర్తయిన కలెక్టరేట్ ను వెంటనే ప్రారంభించాలని ప్రజల పక్షాన డిమాండ్ చేశారు. ప్రజలను ఇంకా ఎన్నాళ్లు హన్మకొండ కు తిప్పుతారు?" అని ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యేను సూటిగా ప్రశ్నించారు.

వీరితోపాటు భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్ధం నరేష్, జలగం రంజిత్, సీనియర్ నాయకులు కుసుమ సతీష్, వంగాల సమ్మిరెడ్డి, రత్నం సతీష్ షా, సముద్రాల పరమేశ్వర్, తాజా మాజీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, గోకుల రాణా ప్రతాప్ రెడ్డి మరియు తదితర రాష్ట్ర జిల్లా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



# డిజిటల్ పంటల సర్వే వేగవంతం చేయాలి!

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి మహా** : జిల్లాలో డిజిటల్ పంటల సర్వేను సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో డిజిటల్ పంటల సర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న సర్వే పురోగతి, రైతుల సాగు వివరాల ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతు సాగు చేస్తున్న పంట వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సన్నరకం ధాన్యం సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అందించే బోనస్ పొందేందుకు డిజిటల్ పంటల సర్వే వివరాలు కీలకమని కలెక్టర్ తెలిపారు. సర్వే పూర్తికాకపోవడం వల్ల ఏ ఒక్క రైతు కూడా బోనస్‌కు దూరం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఏఈఓలు, వ్యవసాయ అధికారులు రైతులతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. మండలాల వారీగా సర్వే పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా జాప్యం ఉంటే వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎంపిక చేసిన వాలంటీర్ల పనితీరును కూడా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. రైతుల సాగు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకుని, ప్రభుత్వ నిర్దేశిత గడువులోగా డిజిటల్ పంటల సర్వేను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రి పొన్నం సమీక్ష

- రేపు నూతన సమీకృత కలెక్టరేట్ ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

**కరీంనగర్ మహా**: ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రేపు కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులతో సమావేశమైన మంత్రి.. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.

నూతన సమీకృత కలెక్టరేట్ భవనం వద్ద పూల అలంకరణ, పరిశుభ్రత, పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్‌ను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. రేపు కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, అనంతరం నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో ప్రత్యేక పూజల్లో పాల్గొని, కలెక్టర్‌ను వారి సీటులో ఆసీనులను చేసి అధికారికంగా విధుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సమగ్ర అభివృద్ధిపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించనున్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, అర్బన్ ఛాలెంజ్ ఫండ్, అర్బన్ డెవలప్‌మెంట్ తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించనున్నారు. కరీంనగర్ అభివృద్ధికి ప్రజాపాలన ప్రభుత్వం కట్టుబడి ఉంది



కరీంనగర్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతులు, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. శాతవాహన యూనివర్సిటీలో గత పదేళ్లుగా వీసీ నియామకం కూడా జరగలేదని విమర్శించారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, ఫార్మసీ, ఇంజనీరింగ్ వంటి విద్యా అవకాశాలను పెంచడంతో పాటు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, రేషన్ కార్డులు, సన్నబియ్యం, రైతు భరోసా, రైతులకు బోనస్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. 70 వేలకుపైగా ఉద్యోగ నియామకాలు చేపట్టామని, విద్యార్థుల సంక్షేమం కోసం హాస్టళ్లలో డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచామని చెప్పారు.

**సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. ఎల్లంపల్లి, లోయర్ మానేరు, మిడ్ మానేరు, అప్పర్ మానేరు, గౌరవెల్లి, కలికోట సూరంపేట తదితర ప్రాజెక్టుల పురోగతిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణకు రూ.250 కోట్లు కేటాయించామని, మిడ్ మానేరు ప్రాజెక్టు బాధితుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

**కరీంనగర్‌పై సీఎం ప్రత్యేక దృష్టి**

మానేరు రివర్‌ఫ్రంట్, డంపింగ్ యార్డ్, కరీంనగర్ రింగ్‌రోడ్డు తదితర కీలక అంశాలు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిలో ఉన్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్య రంగాల్లో మరింత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కరీంనగర్ పర్యటన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్లకు వెళ్లనున్నారు. అక్కడ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి పాదయాత్ర నిర్వహించి, అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. నేతన్నల సమస్యలు, పాత బకాయిల చెల్లింపుతో పాటు చేనేత, పవర్‌లూమ్ రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసా కల్పించనున్నారని మంత్రి తెలిపారు. సీఎం పర్యటన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సీపీ గౌస్ ఆలం, ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.







# కూతురి బర్త్‌డేలో అల్లరి నరేశ్

**మహా:** టాలీవుడ్ నటుడు అల్లరి నరేశ్ తన కుటుంబానికి సంబంధించిన ప్రత్యేక సందర్భాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఆయన కుమార్తె అయానా ఇవికా ఎడారా 10వ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో కొన్ని ప్రత్యేక ఫొటోలను షేర్ చేశారు. తండ్రి, కూతురు కలిసి ఉన్న ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కూతురికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ అల్లరి నరేశ్ ప్రేమతో కూడిన సందేశాన్ని పంచుకున్నారు. అయానా పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యుల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించింది. అల్లరి నరేశ్ తన కుమార్తెతో కలిసి దిగిన ఫొటోల్లో తండ్రి, కూతుళ్ల మధ్య ఉన్న అనుబంధం స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా తన సినిమాలు, పాత్రలకు సంబంధించిన విషయాలను అభిమానులతో పంచుకునే నరేశ్.. కుటుంబానికి సంబంధించిన ప్రత్యేక సందర్భాల్లోనూ అప్పుడప్పుడు వ్యక్తిగత క్షణాలను సోషల్ మీడియా ద్వారా అభిమానులతో షేర్ చేస్తుంటారు. అయానా ఇవికా ఎడారా 2016లో జన్మించారు. 2024లో ఆమె ఎనిమిదో పుట్టినరోజు సందర్భంగా కూడా అల్లరి నరేశ్ తన కుమార్తెతో కలిసి ఉన్న ఫొటోను సోషల్ మీడియాలో పంచుకుని శుభాకాంక్షలు తెలిపారు. కుమార్తెతో తనకున్న అనుబంధం గురించి గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూల్లోనూ నరేశ్ పలు విషయాలను వెల్లడించారు. తండ్రిగా కుమార్తెతో సమయం గడపడం తనకు ఎంతో ఇష్టమని ఆయన తెలిపారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. అల్లరి నరేశ్ విభిన్న కథలు, పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. కామెడీ హీరోగా ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన ఇటీవల కూడా భిన్నమైన కథాంశాలతో సినిమాలు చేస్తున్నారు. కుటుంబ కథనాలు, సామాజిక అంశాలతో కూడిన చిత్రాల్లోనూ నటిస్తూ తనలోని నటుడిని మరో కోణంలో చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం అల్లరి నరేశ్ సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌తో పాటు ఆయన వ్యక్తిగత జీవితంలోని ఫొటోలు కూడా అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తాజాగా కుమార్తె 10వ పుట్టినరోజు సందర్భంగా షేర్ చేసిన ఫొటోలు నెటిజన్లను ఆకట్టుకోవడంతో పలువురు అభిమానులు అయానాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. తండ్రి, కూతురు కలిసి ఉన్న ఈ క్యూట్ మూమెంట్స్ సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి.

# ఎథ్నిక్ లుక్‌లో కుషిత కళ్లపు

**మహా:** తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న నటి కుషిత కళ్లపు తాజాగా అందమైన ఎథ్నిక్ లుక్‌లో మెరిశారు. ఎరుపు, తెలుపు రంగుల కలయికలో రూపొందించిన సంప్రదాయ దుస్తుల్లో ఫొటోషూట్ చేసి సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకున్నారు. సాధారణంగా మోడ్రన్, గ్లామరస్ లుక్స్‌తో కనిపించే కుషిత.. ఈసారి సంప్రదాయ శైలికి ప్రాధాన్యత ఇచ్చి కొత్తగా కనిపించారు. ఎరుపు రంగు డిజైన్ చేసిన బ్లౌజ్‌కు తెల్లటి స్కర్ట్‌ను జత చేసి ఆమె ధరించిన దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దుస్తులకు అనుగుణంగా ఎంచుకున్న ఆభరణాలు, హెయిర్ స్టైల్ లుక్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. మేకప్ విషయంలోనూ ఆమె సహజత్వానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తోంది. చిరునవ్వుతో, విభిన్నమైన పోజులతో కెమెరాకు ఫొటోలు ఇచ్చారు. సంప్రదాయ దుస్తుల్లోనూ తన గ్లామర్‌ను ప్రత్యేకంగా ప్రదర్శిస్తూ ఫ్యాషన్ విషయంలో తనకు నచ్చిన శైలిని చూపించారు. కుషిత కళ్లపు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తరచూ తన ఫొటోషూట్‌లకు సంబంధించిన చిత్రాలను అభిమానులతో పంచుకుంటుంటారు. ఆమె షేర్ చేసే ఫ్యాషన్, ట్రావెల్, ఫొటోషూట్ చిత్రాలకు నెటిజన్ల నుంచి స్పందన వస్తుంటుంది. ముఖ్యంగా విభిన్నమైన దుస్తులు, కొత్త స్టైలింగ్‌తో కనిపించేందుకు ఆమె ఆసక్తి చూపుతుండటంతో యువతలోనూ మంచి క్రేజ్ ఏర్పడింది. నటనతో పాటు ఫ్యాషన్ విషయంలోనూ తన ప్రత్యేకతను చూపించేందుకు కుషిత ప్రయత్నిస్తున్నారు. సినిమాలు, ఫొటోషూట్‌లు, సోషల్ మీడియా కార్యక్రమాలతో అభిమానులకు దగ్గరగా ఉంటున్నారు. తాజాగా ఎరుపుతెలుపు ఎథ్నిక్ లుక్‌లో కనిపించిన ఫొటోలు కూడా నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సింపుల్ స్టైలింగ్‌తోనూ అందంగా కనిపించవచ్చని ఈ లుక్ ద్వారా కుషిత మరోసారి చూపించారు.






# షూటింగ్‌లతో టాలీవుడ్ సందడి

**మహా:** తెలుగు చిత్ర పరిశ్రమలో మళ్లీ షూటింగ్‌ల హడావుడి మొదలైంది. కొంతకాలంగా వివిధ కారణాలతో విరామం తీసుకున్న పలువురు కథానాయకులు తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. దీంతో హైదరాబాద్‌తో పాటు నగర శివారు ప్రాంతాల్లో పలు సినిమా యూనిట్ల సందడి కనిపిస్తోంది. అగ్ర హీరోల భారీ ప్రాజెక్టులతో పాటు యువ కథానాయకుల చిత్రాల షూటింగ్‌లు కూడా వేర్వేరు లొకేషన్లలో కొనసాగుతున్నాయి. అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' చిత్ర బృందం ముంబై షెడ్యూల్‌ను పూర్తి చేసుకుని హైదరాబాద్‌కు చేరుకుంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. మరోవైపు ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ' మూవీ షూటింగ్ కోకాపేట పరిసరాల్లో సాగుతోంది. బాలకృష్ణ నటిస్తున్న 'దాదా' సినిమా చిత్రీకరణ కూడా రామోజీ ఫిల్మ్ సిటీలోనే కొనసాగుతోంది. హీరో షూటింగ్‌లో పాల్గొనని సమయంలో ఇతర నటీనటులకు సంబంధించిన సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. అక్కినేని నాగార్జున నటిస్తున్న 'కింగ్ 100' సినిమా షూటింగ్ అన్నపూర్ణ స్టూడియోలో వేగంగా జరుగుతోంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న మరో చిత్రానికి సంబంధించిన షూటింగ్ అజీజ్‌నగర్‌లో జరుగుతున్నట్లు సమాచారం. మహేశ్‌బాబు నటిస్తున్న 'వారణాసి' సినిమా చిత్రీకరణ ముచ్చింతల్లో కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'కాకా' చిత్రానికి తదుపరి షెడ్యూల్ అక్టోబర్ 1 నుంచి అల్యూమినియం ఫ్యాక్టరీలో జరగనుంది. దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తున్న 'జై హనుమాన్' సినిమా షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. నితిన్, నాని కాంబినేషన్‌లో రూపొందుతున్న 'అలియాస్ రుక్మిణి' చిత్రీకరణ అల్యూమినియం ఫ్యాక్టరీలో కొనసాగుతోంది. శర్వానంద్ నటిస్తున్న 'జార్జ్ క్రిష్' సినిమా షూటింగ్ మొయినాబాద్‌లో జరుగుతోంది. శ్రీ విష్ణు నటిస్తున్న చిత్రం, సాయి ధరమ్ తేజ్ నటిస్తున్న 'సంబరాల ఏటిగట్టు' సినిమాల షూటింగ్‌లు కూడా వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. గోపీచంద్ నటిస్తున్న సినిమా చిత్రీకరణ శంకరపల్లి ప్రాంతంలో కొన్ని వారాలుగా సాగుతోంది. హీరో కిరణ్ అబ్బవరం దర్శకత్వంలో రూపొందుతున్న కొత్త చిత్రానికి సంబంధించిన షూటింగ్ కూడా అల్యూమినియం ఫ్యాక్టరీలో జరగనుంది. ఇలా ఒకేసారి పలువురు స్టార్ హీరోలు, యువ కథానాయకుల సినిమాలు షూటింగ్ దశలో ఉండటంతో టాలీవుడ్‌లో మళ్లీ సందడి నెలకొంది. రాబోయే రోజుల్లో మరిన్ని చిత్రాల కొత్త షెడ్యూల్స్ ప్రారంభం కానుండటంతో హైదరాబాద్ పరిసరాల్లో షూటింగ్ వాతావరణం మరింత పెరగనుంది.

# పులిలా వచ్చిన ఎన్టీఆర్

**మహా:** మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో నటించిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జూనియర్ ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చాలాకాలం తర్వాత తారక్ ఓ సినిమా ఈవెంట్‌లో కనిపించడంతో అభిమానుల్లో ప్రత్యేక ఉత్సాహం కనిపించింది. ఆయన ఈవెంట్ ప్రాంగణంలోకి అడుగుపెట్టిన తీరు అభిమానులను ఆకట్టుకుంది. ముఖ్యంగా 'యమదొంగ' చిత్రంలోని ఎన్టీఆర్ పాత్రను గుర్తు చేసేలా రూపొందించిన ప్రత్యేక ఎంట్రీ సెటప్ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఎంట్రీకి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది. అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కార్యక్రమ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఎన్టీఆర్ వేదికపైకి వచ్చిన సమయంలో అభిమానుల నినాదాలతో ప్రాంతం మార్మోగింది. తారక్‌కు ప్రత్యేకంగా రూపొందించిన ఎంట్రీలో సినిమా నేపథ్యాన్ని గుర్తు చేసే అంశాలను ఉపయోగించడం విశేషంగా నిలిచింది. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' చిత్రానికి ఎస్.ఎస్. రాజమౌళి సమర్పకుడిగా వ్యవహరిస్తుండగా, శశాంక్ యేలేటి దర్శకత్వం వహించారు. ఫహాద్ ఫాజిల్, చిన్నారి సారా పాలేకర్ ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్. కార్తికేయ నిర్మిస్తున్న ఈ చిత్రానికి కాల భైరవ సంగీతం అందించారు. అక్టోబర్ 2న సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో ఇప్పటికే పలువురు ప్రముఖులు భాగమయ్యారు. చిత్ర ట్రైలర్‌లో నందమూరి బాలకృష్ణ వాయిస్ ఓవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తమిళ వెర్షన్‌కు కమల్ హాసన్, మలయాళ వెర్షన్‌కు మోహన్‌లాల్ వాయిస్ అందించారు. దీంతో సినిమా ప్రమోషన్‌కు దక్షిణాది సినీ పరిశ్రమలోని ప్రముఖుల అనుబంధం ప్రత్యేక ఆసక్తిని తీసుకొచ్చింది. సినిమా కథ విషయానికి వస్తే.. ఫహాద్ ఫాజిల్ ఓ వీధి మాంత్రికుడి పాత్రలో కనిపించనున్నారు. సాధారణంగా తన మాయాజాలంతో ప్రేక్షకులను ఆకట్టుకునే అతడి జీవితంలోకి అసాధారణ శక్తులు ఉన్న ఓ చిన్నారి రావడంతో కథ కొత్త మలుపు తీసుకుంటుంది. ఆ చిన్నారి తన తల్లిదండ్రుల కోసం వెతుకుతుండగా, ఆమెకు సాయం చేసే క్రమంలో ఫహాద్ పాత్ర ఎదుర్కొనే పరిణామాల చుట్టూ కథ సాగుతుంది. ఫాంటసీ, అడ్వెంచర్, ఎమోషన్ అంశాలను కలిపి ఈ చిత్రాన్ని రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ఎన్టీఆర్ హాజరు కావడంతో చిత్ర బృందానికి మరింత ఉత్సాహం వచ్చింది. రాజమౌళి కుటుంబంతో ఎన్టీఆర్‌కు ఉన్న అనుబంధం నేపథ్యంలో ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక అక్టోబర్ 2న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో చిత్రంపై ఆసక్తి నెలకొంది.



# ఫ్లోరల్ లుక్‌లో ప్రియా భవానీ

**మహా:** అందం, అభినయంతో దక్షిణాది ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటి ప్రియా భవానీ శంకర్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో సందడి చేశారు. తాజాగా ఆమె చేసిన ఫొటోషూట్‌కు సంబంధించిన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. క్రీమ్ కలర్ ఫ్లోరల్ ప్రింట్ దుస్తుల్లో కనిపించిన ప్రియా.. సింపుల్ స్టైలింగ్‌తో ఆకర్షణీయంగా కనిపించారు. పూల డిజైన్లతో కూడిన స్లీవ్‌లెస్ టాప్, దానికి సరిపోయే ప్యాంట్‌ను ధరించి ఫ్యాషన్ పరంగా ప్రత్యేకంగా నిలిచారు. దుస్తులకు తగ్గట్టుగా ఎంచుకున్న ఆభరణాలు ఆమె లుక్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. గోల్డ్ బ్యాంగిల్స్, హూప్ ఇయరింగ్స్, రింగ్స్‌తో ప్రియా తన స్టైలింగ్‌ను పూర్తి చేశారు. వంకర్లు తిరిగిన జుట్టును ఒకవైపునకు వదిలి, తేలికపాటి మేకప్‌తో కెమెరా ముందు పోజులిచ్చారు. చిరునవ్వుతో కనిపించిన ఆమె ఫొటోలు సహజమైన అందాన్ని ప్రతిబింబించేలా ఉన్నాయి. భారీగా అలంకరణలు లేకుండానే సింపుల్ లుక్‌తో ఆకట్టుకోవడం ఈ ఫొటోషూట్‌లో ప్రత్యేకంగా కనిపించింది. ప్రియా భవానీ శంకర్ కెరీర్ టెలివిజన్ నుంచి ప్రారంభమైంది. వార్తా ప్రసారకర్తగా పనిచేసిన ఆమె అనంతరం నటన వైపు అడుగులు వేశారు. తమిళ చిత్రం 'మేయాద మాన్'తో వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత వరుసగా విభిన్న కథాంశాలతో కూడిన చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'కడైకుట్టి సింగం', 'మాన్స్టర్', 'మాఫియా: చాప్టర్ 1', 'యానై', 'తిరుచిత్రంబలం', 'పాతు తల' వంటి చిత్రాల్లో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. తెలుగు ప్రేక్షకులకు కూడా ప్రియా భవానీ శంకర్ సుపరిచితమే. తెలుగు సినిమాల్లోనూ నటిస్తూ దక్షిణాది భాషల్లో తన కెరీర్‌ను విస్తరిస్తున్నారు. ఇటీవల ఆమె నటించిన 'ఇరుముడి' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల మధ్య మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ ఆమెకు మంచి ఫాలోయింగ్ ఉంది. తన సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌తో పాటు ఫ్యాషన్ ఫొటోషూట్‌లను కూడా అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. తాజా ఫ్లోరల్ లుక్‌లో ప్రియా ఇచ్చిన పోజులు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయ, మోడ్రన్ ఫ్యాషన్ మధ్య సమతుల్యతను పాటిస్తూ విభిన్నమైన స్టైలింగ్‌తో కనిపించడం ఆమె ప్రత్యేకతగా మారింది. తాజా చిత్రాల్లోనూ అదే తరహా సింపుల్ అండ్ ఎలిగెంట్ లుక్‌ను ప్రియా ఎంచుకున్నారు. దీంతో ఆమె ఫొటోలకు సోషల్ మీడియాలో అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com